RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 258 మేడ్చల్ మల్కాజ్‌గిరి 11 అక్టోబర్ 2024 శుక్రవారం పేజీలు : 4

## నిండుకుండలా తుంగభద్ర జలాశయం..

బెంగళూరు : తుంగభద్ర జలాశయంలోకి రోజురోజుకు ఇన్‌ఫ్లో ఎక్కువై నిండుకుండలా మారుతోంది. జలాశయంలో అత్యధిక ఇన్‌ఫ్లో వుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి 1,08,326 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు అధికారులు తెలిపారు. 59.056 టీఎంసీలు నీరు జలాశయంలో చేరాయి. జలాశయం పైభాగంలోని తుంగ, భద్ర జలాశయాలు నిండి, తీర్థహళ్లి, కొడుగు, మలనాడు ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం వుండటంతో అనుకున్న స్థాయికన్నా ఎక్కువగా నీరు చేరుతోంది. ఇప్పటికే రైతన్నలు నాట్లు వేసేందుకు సంసిద్ధులయ్యారు. తుంగభద్ర కాలువ నుంచి సాగునీరు కూడా విడుదల చేశారు. హెచ్చెల్సీ, ఎల్ఎల్‌సీ కాలువలకు కూడా జలాశయం నుంచి సాగునీరు విడుదల చేశారు.

# తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

హైదరాబాద్: తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే బతుకమ్మ వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. చివరి రోజు సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలంతా ఒక్కచోట చేరి ఆడిపాడుతూ సంబురాలు చేసుకుంటున్నారు. మహిళలంతా తీరొక్క పువ్వులతో భక్తి శ్రద్ధలతో బతుకమ్మను పేర్చారు. బతుకమ్మ సంబురాలతో హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ పరిసరాలు వెలుగులీనుతున్నాయి. వందలాది మంది మహిళలు 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అంటూ ఆడిపాడుతున్నారు. వేలాది మంది మహిళలతో హనుమకొండ పద్మాక్షి అమ్మవారి గుండం కిక్కిరిసిపోయింది. వికారాబాద్ జిల్లా తాండూరులో మహిళలు భక్తి శ్రద్ధలతో బతుకమ్మ ఆడారు. కరీంనగర్, నల్గొండ, అదిలాబాద్ తదితర జిల్లాల్లో బతుకమ్మ సంబరాలు కోలాహలంగా సాగుతున్నాయి. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ సంబురాలు నేటితో ముగియనున్నాయి.






## ఏపీ, తెలంగాణలో పని చేస్తున్న ఐఏఎస్, ఐపీఎస్‌లకు బిగ్ షాక్..

హైదరాబాద్, అక్టోబర్ 10: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పని చేస్తున్న అఖిల భారత సర్వీస్ అధికారులకు కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ బిగ్ షాక్ ఇచ్చింది. కేడర్ మార్పు కోసం చేసుకున్న విజ్ఞప్తులను డీఓపీటీ తిరస్కరించింది. కేటాయించిన కేడర్ రాష్ట్రాల్లోనే కొనసాగాలని స్పష్టం చేసింది. ఈ మేరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో పని చేస్తున్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది డీఓపీటీ. తెలంగాణలో పని చేస్తున్న ఆంధ్రప్రదేశ్ కేడర్ అధికారులు ఆమ్రపాలి, రోనాల్డ్ రోస్, వాణి ప్రసాద్, వాకాటి కరుణ, ఏం. ప్రశాంతి తదితరులకు రిలీవ్ ఆర్డర్ జారీ చేసింది. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లో పని చేస్తున్న తెలంగాణ కేడర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఎస్ఎస్ రావత్, అనంత్ రాము, సృజన, శివశంకర్ లోతేటి లకు రిలీవ్ ఆర్డర్ జారీ చేసింది. తెలంగాణలో పని చేస్తున్న ఏపీ కేడర్ ఐపీఎస్ అధికారులు అంజనీ కుమార్, అభిషేక్ మహంతి, అభిలాష బిస్తలకు రిలీవ్ ఆర్డర్ ఇచ్చింది. ఏపీలో పని చేస్తున్న తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధికారి సీహెచ్ హరి కిరణ్‌కు డీఓపీటీ రిలీవ్ ఆర్డర్స్ ఇచ్చింది. అక్టోబర్16వ తేదీ లోగా విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

# మా ఊరి బిడ్డ వస్తున్నాడయ్యో..

## దసరాకు స్వగ్రామానికి వెళుతున్న సీఎం రేవంత్..




## గ్రాండ్ వెల్ కమ్ కి అంతా సిద్ధం

మహబూబ్ నగర్ : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లికి దసరా పండుగ ప్రత్యేక కానుకలు తీసుకువచ్చింది. తెలంగాణ ముఖ్యమంత్రి హోదాలో మొదటిసారిగా రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వంగూరు మండలంలోని స్వగ్రామమైన కొండారెడ్డిపల్లి గ్రామానికి రానుండటంతో ఘనంగా స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లతో పాటు గ్రామంలో అభివృద్ధి పనులు చకచకా సాగుతున్నాయి. దసరా పండగ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లికి రానున్నారు. దీనితో కొండారెడ్డిపల్లితో పాటు వంగూరు మండలంలో విస్తృతంగా అభివృద్ధి పనులు చేపట్టడంపై అధికారులు దృష్టిసారించారు. వంగూరు మండల కేంద్రం నుంచి అన్ని గ్రామాలకు డబుల్ రోడ్డు సౌకర్యం కల్పిస్తున్నారు. కొండారెడ్డిపల్లి గ్రామ అభివృద్ధికి ఇప్పటికే రూ.30 కోట్లు మంజూరు కాగా.. మరో రూ.170 కోట్ల పనులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కొండారెడ్డిపల్లి అభివృద్ధి కోసమే దాదాపు రూ.50 కోట్లు మంజూరవగా వంగూరులో సమీకృత ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం, 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు, వంగూరు నుంచి జూపల్లి వరకు బీటీ డబుల్ రోడ్డు, శ్రీశైలం నేషనల్ హైవే రాంనగర్ స్టేజీ నుంచి కొండారెడ్డిపల్లికి బీటీ రోడ్డు నిర్మాణం, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల కోసం ప్రతిపాదనలను సీఎం కార్యాలయానికి పంపించారు. గత నెల రోజుల నుండి పనులు పూర్తిచేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ముఖ్యమైన పనులను పూర్తిచేసి గ్రామ స్వరూపాన్ని మార్చేలా ఏర్పాట్లు సాగుతున్నాయి.. గ్రామంలో ప్రధానమైనటువంటి గ్రామ పంచాయతీ భవనాన్ని సుమారు 72 లక్షల రూపాయలతో అధునాతనంగా నిర్మించారు..చుట్టూ ప్రశాంతమైన వాతావరణం ఏర్పాటుచేసి గ్రామపంచాయతీలో విలువైన సామాగ్రితో సుందరంగా తీర్చిదిద్దారు. భవనంలో అధికారులు కూర్చోవడానికి సమావేశాలు నిర్వహించడానికి హాల్ తో పాటు ప్రత్యేక వసతులు కల్పించారు. సీఎం రాక సంధర్భంగా జడ్పీటీసీ స్థాయి నుండి తమ గ్రామ బిడ్డ సీఎం హోదాలో ఉండడం తమకెంతో సంతోషంగా ఉందని గ్రామస్తులు అంటున్నారు. ప్రతి సంవత్సరం దసరాకు ఇక్కడికి వచ్చే సీఎం రేవంత్ రెడ్డి అందరితో సాధారణ వ్యక్తి లాగే ఉండేవారని ఈ దసరాకు సీఎం హోదాలో తమ గ్రామానికి వస్తుండడంతో ఎంతో ఆనందంగా ఉందని అంటున్నారు వారు. ప్రతి సంవత్సరం దసరా కన్నా ఈ సంవత్సరం దసరా ఉత్సవాలు అంగరంగ వైభంగా నిర్వహించి పండుగ జరుపుకుంటామన్నారు.

**సీఎం స్వగ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు ఇవే...** రాష్ట్రంలోనే పైలెట్ ప్రాజెక్ట్ కింద కొండారెడ్డిపల్లిని పూర్తిస్థాయిలో సోలార్ విద్యుత్ ఆధారిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గ్రామంలోని ప్రతి ఇంటికి, వ్యవసాయ మోటారు కనెక్షన్కు సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి ఉచితంగా సోలార్ విద్యుత్ అందించనున్నారు. సోలార్ ద్వారా గృహ, వ్యవసాయ, వాణిజ్య అవసరాలకు వినియోగించడంతో పాటు మిగులు విద్యుత్ ను విక్రయించి ఆదాయం పెంచుకునేలా చర్యలు చేపడుతున్నారు. గ్రామంలోని మొత్తం 499 గృహ విద్యుత్ వినియోగదారులు, 66 కమర్షియల్, 867 వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు ఈ ప్రాజెక్ట్ ద్వారా లబ్ధి చేకూరనుంది. రేవంత్ రెడ్డి తన స్వగ్రామంలోని ఆంజనేయస్వామి, శివాలయాల నిర్మాణం కోసం రూ. 4 కోట్ల వరకు సొంత నిధులు కేటాయించారు. గ్రామంలో ఇప్పటికే ఉన్న పాత హనుమాన్ ఆలయాన్ని పూర్తిగా తొలగించి కొత్తగా నిర్మిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఏదైనా కార్యక్రమం చేపట్టినప్పుడు ఈ ఆలయంలోనే పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి బీసీలకు పెద్దపీట వేశారు. ఆయన చెప్పినట్టుగానే భవిష్యత్తులో బీసీల ఎదుగుదలకు ప్రత్యేకమైన కార్యాచరణ రూపొందిస్తున్నారు. మొదటగా తన గ్రామం నుండి మొదలుపెట్టేలా 65 లక్షల రూపాయలతో మహాత్మా జ్యోతిబాపూలే పేరుతో సుందరమైన బీసీ భవనాన్ని నిర్మించారు. గ్రామానికి సంబంధించిన పెద్దలు ముఖ్యులు ఎవరు వచ్చినా కూర్చోవడానికి వీలుగా బీసీ భవనం చుట్టుపక్కల ప్రాంతమంతా సుందరంగా తయారు చేశారు. తమ గ్రామ బిడ్డ సీఎం అయ్యాక గ్రామం అభివృద్ధి పథం వైపు ముందుకు సాగడం ఆనందంగా ఉందని గ్రామస్తులు అంటున్నారు.

**ఆపన్నహస్తం అందించిన సీఎం..** ముఖ్యంగా గ్రామంలో వీరమరణం పొందిన ఆర్మీ జవాన్ యాదయ్య స్మారక గ్రంథాలయాన్ని 55 లక్షల రూపాయలతో నిర్మాణం చేసి సోల్జర్ కుటుంబానికి ఆసరాగా నిలిచారు. దేశం కోసం కార్గిల్ లో ప్రాణాలర్పించిన యాదయ్య కుటుంబానికి ఉద్యోగంతో పాటు 5 ఎకరాల భూమిని ఇచ్చి దేశంపై తనకున్నటువంటి బాధ్యతలు చాటుకున్నారు. 2013లో తమ కుటుంబ సభ్యుడైన యాదయ్య చనిపోతే ఎంతోమంది రాజకీయ నాయకులు వచ్చి ఎన్నో భరోసాలు ఇచ్చారు కానీ అవి చాలా సంవత్సరాలుగా నెరవేరలేదు.. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక ఆరు నెలల్లోనే తమ కుటుంబ కష్టాలు తీర్చడం తమకెంతో ఆనందమని కుటుంబ సభ్యులు అంటున్నారు మొత్తానికి జడ్పీటీసీగా తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన రేవంత్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడే గ్రామ రూపురేఖలు మార్చేందుకు కృషి చేస్తుండగా.. తమ గ్రామం అభివృద్ధి దిశలో పరుగులు పెడుతుందని కొండారెడ్డి పల్లె గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ ప్రతి సంవత్సరంలాగే దసరా పండగ రోజు తమ గ్రామానికి రేవంత్ రెడ్డి రానుండడం తమ అదృష్టంగా భావిస్తున్నామని కొండారెడ్డి పల్లె గ్రామస్తులు తెలిపారు.

# పారిశ్రామిక దిగ్గజానికి కన్నీటి వీడ్కోలు

## అధికార లాంఛనాలతో వర్లి శ్మశాన వాటికలో ముగిసిన అంత్యక్రియలు



టాటా గ్రూప్స్ గౌరవ చైర్మన్ రతన్ టాటా అంత్యక్రియలు ముగిశాయి. ముంబైలోని వర్లి శ్మశాన వాటికలో మహారాష్ట్ర ప్రభుత్వం అధికార లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించింది. కేంద్రం తరఫున హోంమంత్రి అమిత్ షా హాజరయ్యారు. రతన్ టాటా ముంబైలోని బ్రీచ్ కాండీ హాస్పిటల్లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి 11.30 గంటలకు తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఆయన భౌతిక కాయాన్ని ప్రముఖులు, అభిమానుల సందర్శనార్థం ముంబైలోని నారిమన్ పాయింట్లో ఉన్న నేషనల్ సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఉంచారు. సినీ, రాజకీయ, వ్యాపార దిగ్గజాలు రతన్ టాటాకు కడసారి నివాళులర్పించారు. సాయంత్రం 4 గంటలకు రతన్ టాటా భౌతిక కాయాన్ని ఎన్‌సీపీఏ నుంచి అంతిమ యాత్రగా వర్లి శ్మశాన వాటికకు తీసుకెళ్లారు. అక్కడ ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు. పలువురు ప్రముఖులు ఈ అంత్యక్రియల్లో పాల్గొని రతన్ టాటాకు కడసారి కన్నీటి వీడ్కోలు పలికారు.

**అవమానించిన వారికే చేయూత.. దటీజ్ రతన్ టాటా!** దేశంలో వివిధ వ్యాపారాల్లో ఉన్న టాటా గ్రూపు కార్ల తయారీ రంగంలోనూ అడుగుపెట్టింది. అలా 1998లో ఇండికా పేరుతో తొలి హ్యాచ్‌బ్యాక్‌ను తీసుకొచ్చింది. డీజిల్ ఇంజిన్‌తో వచ్చిన ఈ కారు ఆశించిన మేర విజయాన్ని అందుకోలేదు. అమ్మకాలు అంతగా జరగలేదు. దీంతో ఏడాదికే కార్ల తయారీ వ్యాపారాన్ని విక్రయించాలన్న నిర్ణయానికి వచ్చారు రతన్ టాటా. ఆ సమయంలో అమెరికాకు చెందిన ఆటోమొబైల్ కంపెనీ ఫోర్డ్ అందుకు ముందుకొచ్చింది. 1999లో ఇరు కంపెనీల ప్రతినిధులూ భేటీ అయ్యారు. బాంబేహౌస్‌లో ఈ భేటీ జరిగింది. టాటా గ్రూపు నుంచి రతన్ టాటాతో పాటు పలువురు ఆ భేటీలో పాల్గొన్నారు. ఫోర్డ్ కంపెనీ ఛైర్మన్ బిల్‌ఫోర్డ్ కూడా ఆ సమావేశంలోనే ఉన్నారు. దాదాపు మూడు గంటల పాటు ఈ భేటీ జరిగింది. కానీ, కొనుగోలు విషయంలో ముందడుగు పడలేదు.

**రతన్ టాటాకు అవమానం :** ఫోర్డ్ ప్రతినిధులతో జరిగిన ఆ సమావేశంలో రతన్ టాటాకు అవమానం జరిగింది.

'మీకు ఏమీ తెలియనప్పుడు కార్ల తయారీని ఎందుకు ప్రారంభించారు' అంటూ బిల్ ఫోర్డ్ రతన్ టాటాను ఉద్దేశించి అన్నారట. అంతేకాదు.. తామేదో ఉత్తి పుణ్యానికి సాయం చేస్తున్నట్లు మాట్లాడారట. ఆ మాటలకు రతన్ టాటా నొచ్చుకున్నారని ఆ సమావేశంలో పాల్గొన్న వ్యక్తులు ఓ సందర్భంలో చెప్పారు. ఆ సమావేశం తర్వాత తీవ్ర అవమాన భారంలో ఉన్న రతన్ టాటా.. కార్ల వ్యాపారాన్ని విక్రయించాలన్న తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. వ్యాపార ప్రణాళికలు మార్చుకొని అభివృద్ధి చేయాలన్న నిర్ణయానికి వచ్చారు.

**అదే కంపెనీకి చేయూత :** కాలచక్రం గిర్రున తిరిగింది. 9 ఏళ్లు గడిచిపోయాయి. 2008లో మాంద్యం దెబ్బకు ఫోర్డ్ కుదేలైంది. కంపెనీ దివాలా తీసింది. దీంతో ఆ కంపెనీకి చెందిన జాగ్వార్, ల్యాండ్ రోవర్ బ్రాండ్లను టాటా గ్రూపు 2.3 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేసింది. అప్పట్లో అదే బిల్‌ఫోర్డ్ రతన్ టాటాకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. 'జేఎల్‌ఆర్‌ను కొనుగోలు చేసి మాకు ఎంతో సాయపడ్డారు' అంటూ కృతజ్ఞతలు తెలిపారు.

ఈ రెండు సందర్భాలను ప్రత్యక్షంగా చూసిన రతన్ టాటా సన్నిహితుడు ప్రవీణ్ కండ్లే 2015లో ఓ ఈవెంట్‌లో ఈ విషయాన్ని బాహ్య ప్రపంచానికి తెలియజేశారు. అలా కొనుగోలు చేసిన జేఎల్‌ఆర్.. ఇప్పుడు టాటా గ్రూపులో కీలక భూమిక పోషిస్తోంది. టాటా మోటార్స్‌కు పెద్దఎత్తున లాభాలు తెచ్చి పెడుతోంది.

# సంపాదకీయం

## హర్యానా ఫలితాన్ని అంగీకరించని కాంగ్రెస్ జమ్ముకశ్మీర్ మాటేంటి?

అందుకే అంటారు.. ఒక మాట మాట్లాడే ముందు ఆచితూచి అన్నట్లుగా అడుగులు వేయాలని. అందునా.. ఎన్నికల ఫలితాలు వెలువడిన సందర్భంలో ఒక జాతీయ పార్టీ స్పందించే తీరులో న్యాయం.. ధర్మంతో పాటు.. లాజిక్ కూడా మిస్ కాకూడదు. ప్రత్యర్థులు సైతం నిజమే కదా? అన్న ఆత్మరక్షణలో పడేలా వాదన ఉండాలి. అందుకు భిన్నంగా తాను చేసిన పేలవమైన వాదనతో.. ప్రత్యర్థులు వేసే ప్రశ్నకు సమాధానం చెప్పలేక కళ్లు తేలేసే వైనం చూసినప్పుడు.. కాంగ్రెస్ అధినాయకత్వానికి సరైన వ్యూహం ఉండదా? అన్నది ప్రశ్నగా మారింది. ఇటీవల ముగిసిన హర్యానా.. జమ్ముకశ్మీర్ అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడటం తెలిసిందే. హర్యానాలో బీజేపీ తన అధికారాన్ని నిలుపుకుంటే.. జమ్ముకశ్మీర్ లో నేషనల్ కాన్ఫరెన్స్ కు కశ్మీరీలు పట్టం కట్టారు. ఇక్కడో ఆసక్తికర అంశాన్ని ప్రస్తావించాలి. జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక ఓట్ల శాతాన్ని బీజేపీ సొంతం చేసుకున్నప్పటికి.. అధికారాన్ని మాత్రం సొంతం చేసుకోని పరిస్థితి. అదే సమయంలో ఎగ్జిట్ పోల్ అంచనాలు తప్పు అయ్యాయి. హర్యానా.. జమ్ముకశ్మీర్ లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా చేపట్టిన ఎగ్జిట్ పోల్స్ రెండు దారుణంగా ఫెయిల్ అయ్యాయి. హర్యానాలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని.. జమ్ముకశ్మీర్ లో హంగ్ ఖాయమన్న అంచనాల్లో ఏ మాత్రం నిజం లేదని.. రెండు రాష్ట్రాల్లోని ప్రజలు చాలా క్లారిటీతో ఓట్లు వేసిన విషయం ఫలితాల్ని చూస్తే అర్థమవుతుంది. హర్యానా ఎన్నికల ఫలితాన్ని తాము అంగీకరించమని కాంగ్రెస్ చెప్పొచ్చు. ఒకవేళ.. హర్యానా ఎన్నికల్ని ఈవీఎంలు ప్రభావితం చేసినట్లుగా ఆరోపిస్తే.. అదే సూత్రం జమ్ముకశ్మీర్ రాష్ట్ర ఎన్నికలఫలితానికి కూడా వర్తిస్తుంది కదా? అలాంటప్పుడు హర్యానా కాదన్నప్పుడు జమ్ముకశ్మీర్ ఫలితాన్ని కూడా అంగీకరించకుండా ఉంటామని కాంగ్రెస్ చెప్పగలదా? అన్నది ప్రశ్న. కాస్తంత బుర్ర ఉంటే చాలు.. ఎన్నికల ఫలితాల మీద అభ్యంతరం చెప్పేటప్పుడు.. అన్ని చూసుకొని మాట్లాడాలి కదా? ఆ మాత్రం తెలివి లేనట్లుగా కాంగ్రెస్ అధినాయకత్వం చేసిన వ్యాఖ్యలు పేలవంగా ఉండటమే కాదు.. వాదనకు ఏ మాత్రం సెట్ కానట్లుగా మారింది. హర్యానా ఎన్నికల ఫలితాన్ని అంగీకరించమని చెప్పటం ద్వారా కాంగ్రెస్ సెల్ఫ్ గోల్ వేసుకుందన్న మాట వినిపిస్తోంది. ఇప్పటికైనా తెలివి తెచ్చుకొని తమ మాటల్లో లాజిక్ మిస్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# మైనర్ల వేగం.. తల్లిదండ్రులకు శోకం



కరీంనగర్ : ఒడిశాకు చెందిన ఓ కార్మికుడు జీవనోపాధి నిమిత్తం కుటుంబంతో సహా అయిదేళ్ల కిందట కరీంనగర్‌కు వచ్చారు. ఉపాధి పొందుతూ ఇక్కడే స్థిరపడ్డారు. నెల రోజుల కిందట ఆయన కుమారుడు (పదహారు ఏళ్లు) ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ద్విచక్రవాహనం తీసుకొని స్నేహితులతో రాత్రివేళ నగర శివారుకు వెళ్లాడు. ఇంటికి వచ్చే క్రమంలో ఉజ్వలపార్క్ వద్దనున్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. కరీంనగర్ ఒకటో ఠాణా పరిధిలోని ఓ విద్యార్థి ఇంట్లో ఎవరికీ తెలియకుండా కారు బయటకు తీసుకెళ్లాడు. వాహన వేగాన్ని అదుపు చేయకపోవడంతో రోడ్డు పక్కన పని చేసుకుంటున్న వారిపై కారు దూసుకెళ్లడంతో నలుగురు మృతి చెందారు. మరో నలుగురు గాయపడ్డారు. ఈ సంఘటన అప్పట్లో కలకలం రేపింది. విద్యార్థి తండ్రితోపాటు కారులో ప్రయాణించిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. పద్దెనిమిదేళ్లలోపే చాలామంది విద్యార్థులు ద్విచక్రవాహనాలు, కార్లు నడపాలని ఉత్సాహపడుతుంటారు. అది కాస్త ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. ఇటీవల జరిగిన ఘటనలే ఇందుకు ఉదాహరణగా నిలుస్తున్నాయి. 8వ తరగతి చదువుతున్న చాలామంది విద్యార్థులు వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడుతున్నారు. ఈ ఏడాది కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో ఇప్పటివరకు 70కి పైగా మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేశారు.

పర్యవేక్షణ లోపం..

వాహనం నడపాలంటే 18 ఏళ్లు నిండటమే కాకుండా రవాణా శాఖ జారీ చేసిన డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. ఇవేమి పట్టకుండా కొంతమంది తల్లిదండ్రులు వారి పిల్లలకు వాహనాలు ఇస్తున్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛతో ఇష్టానుసారంగా నడుపుతూ.. ప్రమాదం జరిగితే వాహనాన్ని అక్కడే వదిలేసి జారుకుంటున్నారు. వాహన వినియోగంపై సరైన అవగాహన లేకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు పేర్కొంటున్నారు.

ఇవీ నిబంధనలు..రవాణా శాఖ నిబంధనల ప్రకారం 18 ఏళ్లు నిండి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్నవారు మాత్రమే వాహనం నడిపేందుకు అర్హులు.మైనర్లు వాహనం నడిపినా, ఏదైనా ప్రమాదం జరిగినా అందుకు కుటుంబ పెద్దలను బాధ్యులుగా చేస్తూ వారిపై కేసు నమోదు చేస్తారు. రూ.1500 జరిమానా విధిస్తారు.

కేసును బట్టి తల్లిదండ్రులు, వాహన యజమానులకు 21 రోజుల జైలు శిక్ష.. రూ.5 నుంచి రూ.25 వేల జరిమానా వేస్తారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కొత్త రవాణా చట్టం ప్రకారం.. మైనర్లు జువైనల్ హోంకు వెళ్లే అవకాశముంది. మైనర్లు వాహనం పడిన సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే.. అతని వయసు, ప్రవర్తన బట్టి కేసును క్రిమినల్ కోర్టుకు బదిలీ చేస్తారు.కేసులు మరింత కఠినం..మైనర్ డ్రైవింగ్‌పై శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. మొదటిసారి పట్టుబడితే వారితోపాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తాం. రెండోసారి మాత్రం చట్టపరమైన చర్యలు తీసుకుం టాం. ఏదైనా ప్రమాదం జరిగితే మైనర్‌తోపాటు అతని తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తాం.– జి.నరేందర్, ఏసీపీ కరీంనగర్ టౌన్

# నిఘా నేత్రాలకు గ్రహణం!



కరీంనగర్ : హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ తర్వాత రాష్ట్రంలో రెండో అతిపెద్ద బస్టాండ్ కరీంనగర్‌దే. ఇక్కడ 45 ప్లాట్‌ఫాంలు ఉండగా నిత్యం 1,825 బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. కరీంనగర్ నుంచి రోజు లక్ష మందికి పైగా వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది డిసెంబర్ 9 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అలాంటి ప్రయాణ ప్రాంగణంలో సీసీ కెమెరాలు తగినన్ని లేవు. ఉన్నవి పని చేయకపోవడంతో దొంగతనాలు, పోకిరీల బెడద పెరిగింది.

**పట్టింపేదీ?** బస్టాండ్ లోపల, బయట 65కు పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇందులో 45 కెమెరాలు ప్రయాణ ప్రాంగణ ఆవరణలో ఉండగా మిగితావి బయట ఉన్నాయి. వీటి పర్యవేక్షణకు పోలీస్‌శాఖకు బస్టాండ్‌లో ఓ గది (ఔట్‌పోస్ట్)ని కూడా కేటాయించారు. ప్రస్తుతం బస్టాండ్‌లో ఏ ఒక్క సీసీ కెమెరా పనిచేయడం లేదు. కొన్ని నిఘా నేత్రాలకు సంబంధించి తీగలు తెగిపోగా మిగిలినవి కూడా పాడైపోగా బాగు చేయించడం లేదనే విమర్శలు ఉన్నాయి. నేర ఘటనలు జరిగినపుడు నిందితులను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయి. సీసీ ఫుటేజీల ఆధారంగా పలు కేసుల్లో పోలీసులు గతంలో నిందితులను పట్టుకున్నారు. గతంలో సీసీ కెమెరాలను పోలీసు శాఖ నుంచి నిత్యం పర్యవేక్షించేవారు. ప్రస్తుతం ఆ నిఘానేత్రాలు పని చేయక పోవడంతో బాగు చేయించడానికి గానీ, లేదా కొత్తవి కొనుగోలు చేయడానికి గానీ ఇటు పోలీసుశాఖకు, అటు ఆర్టీసీకి ప్రత్యేకంగా నిధులు అంటూ లేవు. దీంతో సమస్య పరిష్కారానికి ఎవరూ ముందుకు రావడం లేదు. సమస్యపై ఆర్ఎం సుచరితను 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. మంత్రిపైనే ఆశలు..

రవాణశాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్ ఉండటంతో బస్టాండ్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు విషయంలో ఆశలు చిగురిస్తున్నాయి. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్తే కొత్త నిఘా నేత్రాలను బిగించడానికి అవసరమైన నిధులు కేటాయించే అవకాశం ఉంటుంది. వీటి పర్యవేక్షణకు పోలీసు సిబ్బంది కూడా నిత్యం బస్టాండ్‌లో ఉండేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. గతంలో 23 మంది పొరుగు సేవల సెక్యూరిటీ సిబ్బంది ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య తగ్గింది. సిబ్బందిని పెంచేందుకు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

**ఆందోళనలో ప్రయాణికులు..**

ప్రయాణికుల సంఖ్య పెరగడంతో కొందరు దొంగలు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. సెల్‌ఫోన్లు, విలువైన వస్తువుల అపహరణకు పూనుకుంటున్నారు. ఈ నెల 27న సిద్దిపేట నుంచి వచ్చిన ఇద్దరు యువకులు బస్టాండ్‌లో మహిళ మెడలోంచి పుస్తెలతాడు, ప్రయాణికుల జేబులోంచి పర్సులు కొట్టేయడానికి యత్నించగా సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. గంజాయి మత్తులో ఉన్న కొందరు యువకులు చోరీకి యత్నిస్తూ ప్రయాణికులపై బెదిరింపులకు పాల్పడగా సెక్యూరిటీ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. బ్యాగులు, సెల్‌ఫోన్లు చోరీకి గురైన కేసులు నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల ఓ మహిళా కూడా చోరీకి యత్నిస్తూ సెక్యూరిటీ సిబ్బందికి పట్టుబడింది. కొందరు మద్యం మత్తులో ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తూ మహిళలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రాత్రి సమయంలో అక్కడే ఉంటూ వేధింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

# నేతన్నకు ముందే సంక్రాంతి

సిరిసిల్ల : అరకొర ఆర్డర్లతో ఆగుతూ సాగే జిల్లా వస్త్ర పరిశ్రమలో నాలుగు రోజులుగా పాలిస్టర్ మరమగ్గాలపై ఉత్పత్తి పుంజుకుంటోంది. తమిళనాడు ప్రభుత్వం ఏటా పొంగల్ (సంక్రాంతి) కానుకల్లో మహిళలకు చీరలు, పురుషులకు పంచెలు అందజేస్తుంది. ప్రభుత్వం నుంచి ఆర్డర్లు దక్కించుకున్న గుత్తేదారులు తిరుపూర్, కోయంబత్తూర్, ఈరోడ్, సేలం వంటి వస్త్రోత్పత్తి కేంద్రాల్లో కాటన్ పంచెలు ఉత్పత్తి చేయిస్తున్నారు. పాలిస్టర్ చీరలు మాత్రం సిరిసిల్లకు పంపుతున్నారు. తొమ్మిది నెలలుగా చాలీచాలని ఉపాధితో కాలం వెళ్లదీస్తున్న నేత కార్మికులకు మూడు నెలల పాటు ఉపాధికి ఢోకా లేదు. వీటికి అవసరమైన ముడి సరకు పూర్తిగా తమిళనాడు నుంచే వస్తుంది. ప్రాసెసింగ్, ప్యాకింగ్ అంతా అక్కడే జరుగుతుంది.

జిల్లా వస్త్ర పరిశ్రమలోని మరమగ్గాలపై తమిళనాడు ఆర్డర్లతోనే చీరలు పరిచయమయ్యాయి. వీటి ఆధారంగానే గత ప్రభుత్వం 2017 నుంచి 2023 వరకు బతుకమ్మ చీరలు, రంజాన్, క్రిస్మస్ కానులను తీసుకొచ్చింది. ఈ ఏడాది వాటి ఊసేలేకుండా పోయింది. తమిళనాడులో సంక్రాంతి కానుకగా 3.12 కోట్ల చీరలు, పంచెల పంపిణీకి బడ్జెట్‌లో రూ.485.25 కోట్లు కేటాయించారు. వీటిలో 1.56 కోట్ల చీరలున్నాయి.

జిల్లాలో 30 వేల మరమగ్గాలపై రోజుకు పది లక్షల మీటర్లు ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. ఈ పరిస్థితిలో పరిశ్రమలోని వ్యాపారులు తమిళనాడు చీరల ఆర్డర్లను అందిపుచ్చుకుంటున్నారు. ఇప్పటికీ 11 లక్షల మీటర్ల ఆర్డర్లు వచ్చాయి. రాబోయే రోజుల్లో ఇవి మరింతగా పెరిగే అవకాశం లేకపోలేదు. మీటరుకు కార్మికుడికి రూ.2.20, ఆసామికి రూ.2.50 చెల్లిస్తున్నారు.

నూలు ప్రత్యేకం

తమిళనాడు ప్రభుత్వం చీరల ఉత్పత్తికి ప్రత్యేకంగా ఎయిర్‌టెక్స్ పాలిస్టర్ నూలును వినియోగిస్తుంది. పంచెల్లో 40:60 మోతాదుల్లో కాటన్,



పాలిస్టర్ కలిపి ఉపయోగిస్తుంది. పంచెల తయారీలో అక్కడి కాటన్ పరిశ్రమ నిలదొక్కుకుంటోంది. ఏడేళ్లుగా రాష్ట్రంలో గత ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లతో వందశాతం పాలిస్టర్ ఉపయోగించారు. దీంతో వేడి ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగా మహిళలు చాలా వరకు వీటిపై ఆసక్తి చూపలేదు. గత ప్రభుత్వం సంక్షేమశాఖల ద్వారా ఇచ్చిన ఆర్డర్లకు, సేకరించిన వస్త్రానికి సంబంధించి ఇంకా రూ.130 కోట్ల వరకు రావాల్సి ఉంది.

మూడు నెలలు ఉపాధి

– లగిశెట్టి ప్రసాద్, నేత కార్మికుడు

మా కారా?నాలో సంక్షేమశాఖలకు సంబంధించిన టెస్కో ఆర్డర్లు నాలుగు, తమిళనాడు చీరలు మూడు మగ్గాలపై ఉత్పత్తి చేస్తున్నాను. తమిళనాడు చీరలకు మీటరుకు రూ.2.20 ఇస్తున్నారు. పది మగ్గాలపై పని చేయడంతో వారానికి రూ.3 వేల వరకు కూలి గిట్టుబాటు అవుతుంది. మన ప్రభుత్వం నుంచి ఆర్డర్లు తగ్గడంతో వీటితో ఊరట లభిస్తుంది.

# గ్రామీణ రహదారులు బాగయ్యేనా..!

రామగుండం : రామగుండం పారిశ్రామిక ప్రాంతమే ఆధారంగా వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకుంటూ జీవనం సాగించే సుమారు పది గ్రామాల ప్రజలకు ఇదే ప్రధాన రహదారి. గోదావరిఖని నుంచి పెద్దపల్లికి వెళ్లేవారితో పాటు వివిధ గ్రామాలకు వెళ్లేవారికిదే దగ్గరి దారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న రోడ్డు సుమారు రెండు దశాబ్దాలుగా గుంతలమయంగా ఉంటోంది. వర్షం కురిసిందంటే బురదమయంగా మారుతోంది. ఎట్టకేలకు డి.ఎం.ఎఫ్.టి. నిధులు రూ.2.5 కోట్ల అంచనాలతో రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో గ్రామీణులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. కాగా నత్తనడకన సాగుతున్న పనులు వారిని నిరాశకు గురిచేస్తున్నాయి.

ఆది నుంచీ అవరోధాలే.. ఫెర్టిలైజర్ సిటీ నుంచి గుంటూరుపల్లి, ఎల్కలపల్లి మీదుగా పెద్దపల్లికి వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణంలో ఆదినుంచి నిర్లక్ష్యమే కనిపిస్తోంది. ఎల్కలపల్లి నుంచి పెద్దపల్లి వరకు రోడ్డు బాగానే ఉండగా ఫెర్టిలైజర్ సిటీ నుంచి ఎల్కలపల్లి వరకు చాలా ఇబ్బందికరంగా ఉంది. గతంలో పలు మార్లు రహదారి నిర్మాణం చేపట్టినప్పటికీ నాణ్యతాప్రమాణాలు పాటించకపోవడంతో అనతి



కాలంలోనే రహదారి శిథిలమయ్యేది. ఉన్న రోడ్డును కాస్త ఇటీవల రామగుండం ఎరువుల కర్మాగారానికి నీటి సరఫరా పైపులైను నిర్మాణం కోసం తవ్వడంతో గుంతలమయంగా మారింది. రోడ్డు తవ్వడాన్ని గ్రామీణులు అడ్డుకోగా పైపులైను నిర్మాణం పూర్తికాగానే రోడ్డు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చిన రామగుండం ఎరువుల కర్మాగారం అధికారులు ఆ విషయాన్నే విస్మరించారు. ఎట్టకేలకు డి.ఎం.ఎఫ్.టి. నిధులు రూ. 2.5 కోట్లతో రహదారి నిర్మాణానికి రంగం సిద్ధం చేశారు. శాసనసభ ఎన్నికలకు ముందు టెండరు ప్రక్రియ పూర్తికాకపోయినా హడావుడిగా రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఈ రోడ్డుపై ప్రత్యేక దృష్టి సారించారు. టెండరు ప్రక్రియ పూర్తి చేయించడంతో పాటు పనులు ప్రారంభించారు. ఫెర్టిలైజర్ సిటీ గేటు నుంచి ఎల్కలపల్లిగేటు కాలనీ చివరి వరకు సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టినప్పటికీ అక్కడి నుంచి ఎల్కలపల్లి చివరి వరకు తారు రోడ్డు నిర్మించాల్సి ఉంది. వివిధ కారణాలతో ఎల్కలపల్లిగేటు నుంచి ఎల్కలపల్లి మూల వరకు కంకర పోసి రోలర్‌తో తొక్కించి వదిలేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మళ్లీ గుంతలు పడ్డాయి.

త్వరలోనే పూర్తి

– మక్కాన్‌సింగ్, ఎమ్మెల్యే, రామగుండం

త్వరలోనే ఎల్కలపల్లి రోడ్డు నిర్మాణం పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నాం. గత కొన్నేళ్లుగా గ్రామీణులు ఎదుర్కొంటున్న ప్రధాన రహదారి సమస్య పరిష్కారం కానుంది. రోడ్డు నిర్మాణానికి అవసరమైన అదనపు నిధులు సైతం మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణం పనులపై గ్రామీణులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

# వానర బెడద ఇంతింత కాదయా

కరీంనగర్ : కరీంనగర్ జిల్లాలో కోతుల గోల మళ్లీ మొదలైంది. ఒకట్రెండు కాదు.. సమూహాలుగా ఏర్పడి వీధుల్లో తిరుగుతున్నాయి. కంటికి కనిపించిన ఆహార పదార్థాలను తీసుకెళ్తుండగా ప్రజలు అవస్థలు పడుతున్నారు. రాకపోకలు సాగించే సమయాల్లో చేతుల్లోని వస్తువులను కూడా లాక్కొని వెళ్తున్నాయి.

కోతుల దాడిలో గాయాలు

నెల రోజుల కిందట కరీంనగర్ గ్రామీణ మండలం ఎలబోతారానికి చిన్నారి పాఠశాలకు వెళ్తుండగా కోతులు దాడి చేసి కాలికి గాయం చేశాయి. మరో రోజు ఇదే గ్రామానికి చెందిన మరో వృద్ధురాలిపై దాడి చేయగా, ముఖంపై గాయాలయ్యాయి. ఇలా జిల్లాలో ఎక్కడో ఒక చోట గాయపరుస్తూనే ఉన్నాయి.

నగరంలోని భగత్‌నగర్, హనుమాన్‌నగర్, కట్టరాంపూర్, కోతిరాంపూర్, సప్తగిరికాలనీ, శివనగర్, గణేశ్‌నగర్, మారుతీనగర్, సీతారాంపూర్, తీగలగుట్టపల్లి, సుభాష్‌నగర్, సవారన్‌స్ట్రీట్, కిసాన్‌నగర్, తదితర ప్రాంతాల్లో కోతులు జనావాసాల్లోనే తిష్ఠ వేస్తున్నాయి.

పెరిగిన ఫిర్యాదులు

కోతులు, కుక్కల సంఖ్య విపరీతమైన ఫిర్యాదులు వస్తున్నాయి. గతంలో టెండర్లు నిర్వహించి ఎప్పటికప్పుడు పట్టుకొని అటవీ ప్రాంతానికి తరలించే వారు. గతేడాది నుంచి వీటిని కూడా పట్టుకోవడం లేదు. ఇటీవల జరిగిన నగరపాలిక సర్వసభ్య సమావేశంలో కార్పొరేటర్లు,



కోఆప్షన్ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కుక్కల నియంత్రణకు శస్త్ర చికిత్సలు చేస్తుండగా, మర్కటాల విషయంలో ఎలాంటి స్పందన కనిపించడం లేదు.

ఇలా అయితే ఎలా?నగరంలో పట్టుకుంటున్న కోతులను అటవీశాఖ అధికారుల సూచనల మేరకు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న అటవీ ప్రాంతంలో వదిలేస్తున్నారు.సమీప గ్రామాల్లో పట్టుకున్న వానరాలను రాత్రిపూట తీసుకొచ్చి సిరిసిల్ల బైపాస్, రామగుండం బైపాస్ రహదారులపై వదిలేస్తున్నారు.

గతంలో ఒకసారి హౌసింగ్‌బోర్డుకాలనీలో ఎక్కడి నుంచో కోతులను తీసుకొచ్చి వదిలేసి పారిపోయారు. వాహనాన్ని వెంబడించినా దొరకకుండా వెళ్లిపోయారు. శివారు ప్రాంతాల్లో వదిలేస్తే కనీసం ఆ వాహన నంబర్ ఫొటో తీసి నగరపాలక అధికారులకు చేరవేస్తే చట్టపరంగా చర్యలు తీసుకునే వీలుంది.పట్టుకునేలా చర్యలువేణుమాధవ్, సహాయ కమిషనర్, కరీంనగర్ నగరపాలిక

కోతులను పట్టుకోవడానికి టెండర్లు పిలిచేందుకు చర్యలు చేపట్టాం. త్వరలోనే పట్టుకుంటాం. ఇప్పటికే ఈ విషయాన్ని పశు వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లాం.

# మొక్కే కదా అని వదిలేస్తే..

హైదరాబాద్ : మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌కు చెందిన 19 ఏళ్ల యువకుడు స్థానిక రైల్వే ట్రాక్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గట్టిగా ప్రశ్నించగా.. రైల్వే ట్రాక్ పక్కన గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు అంగీకరించాడు. బిహార్‌కు చెందిన యువకుడు ధూలపల్లిలోని ఓ కంపెనీలో పనిచేస్తున్నారు. అతని నివాసం వద్ద కొత్తరకం మొక్కలు పెంచుతున్నట్లు సమాచారం అందుకుని మేడ్చల్ అబ్కారీ పోలీసులు దాడి చేయగా గంజాయి అని తేలింది.

నగరంలో గంజాయి మొక్కల పెంపకం చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఆంధ్రా–ఒడిశా సరిహద్దుల నుంచి ఓవైపు పెద్దఎత్తున గంజాయి సరఫరా అవుతుండగా.. కొందరు కేటుగాళ్లు ఇక్కడే సొంతంగా మొక్కలు పెంచడం పోలీసులు, అబ్కారీ శాఖకు సవాల్‌గా మారింది.



గంజాయి స్మగ్లింగ్, విక్రయాలపై నిఘా పెరగడం, పట్టుబడితే కటకటాలు తప్పవన్న కారణంతో కొందరు ఇంటి ఆవరణలో, నగర శివార్లలో మొక్కలు పెంచుతున్నారు. అబ్కారీ శాఖ ఈ ఏడాది సెప్టెంబరు వరకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో 663 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకుంది. సెప్టెంబరులోనే 203 మొక్కలను పట్టుకున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు సరఫరా అయ్యే గంజాయిలో దాదాపు 40 శాతం ధూల్‌పేట నుంచే వెళ్తోంది.

ఏవోబీలో కిలో రూ.3 వేలుగా ఉన్న గంజాయి ధర నగరానికి సరఫరా అయిన తరువాత రూ.30 వేలకు చేరుతోంది.

# పని చేయని బోరుకు ప్రాణం

హైదరాబాద్ : చాలా కాలంగా చుక్క నీరు రాకుండా.. మూలకు చేరిన జలమండలి బోర్లు తిరిగి ప్రాణం పోసుకోనున్నాయి. గ్రేటర్ వ్యాప్తంగా ఈ వినూత్న ప్రక్రియకు జలమండలి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ప్రతి ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరి చేసింది. లేదంటే వచ్చే వేసవి నుంచి అలాంటి ఇళ్లకు నీటి ట్యాంకర్లను మూడు రెట్ల ధరకు విక్రయించనున్నారు. ఇందులో భాగంగా పనిచేయకుండా ఉన్న బోర్ల వద్ద ఇంజక్షన్ వెల్‌లను ఏర్పాటు చేసి తిరిగి వాటిని పనిచేసేలా చేయనున్నారు. గ్రేటర్ వ్యాప్తంగా జలమండలి చెందిన 3,222 వరకు పవర్ బోర్లు, చేతి పంపులు ఉన్నాయి. భూగర్భ జలాలు



అడుగంటిపోవడంతో కొన్ని పనిచేయడం లేదు. ఎండిపోయిన బోరుకు సమాంతరంగా ఇంజక్షన్ వెల్ ఏర్పాటు చేయనున్నారు. వర్షపు నీరు ఆ ఇంజక్షన్ వెల్‌లోకి పంపనున్నారు. ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగి తిరిగి బోర్లు పనిచేయనున్నాయి. దీనివల్ల మరోసారి బోరు ఎండిపోయే పరిస్థితి ఉండదు.

నగరంలో జలమండలికి చెందిన బోర్ వెల్స్ ఇలా..

మొత్తం పవర్ బోర్లు 2,796 పని చేయనివి 942 కూలినవి 84మొత్తం చేతి పంపులు 3070 పనిచేయనవి 1717 కూలిపోయినవి 339

# పౌర సేవల్లో జాప్యమేల?

పెద్దపల్లి : పురపాలికల్లో వివిధ పౌరసేవలను నిర్ణీత గడువులోగా అందించాల్సి ఉంటుంది కానీ.. గత నెలరోజులుగా జిల్లాలోని వివిధ పురపాలికలు ఇన్‌ఛార్జి అధికారులు ఏలుబడిలో ఉండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వివిధ కారణాలతో వెళ్లిపోయినా.. అధికారుల స్థానంలో కొత్తవారి నియామకం జరగకపోవడంతో ఇన్‌ఛార్జిలే పరిపాలన సాగిస్తున్నారు.

ఇదీ పరిస్థితి రామగుండం నగరపాలిక కమిషనర్‌గా జిల్లా అదనపు పాలనాధికారి అరుణశ్రీ, మంథని కమిషనర్‌గా పురపాలిక సూపరింటెండెంట్ మనోహర్, సుల్తానాబాద్ పురపాలిక ఇన్‌ఛార్జి కమిషనర్‌గా పెద్దపల్లి కమిషనర్ వెంకటేశ్ వ్యవహరిస్తున్నారు. వారం క్రితం ఇన్‌ఛార్జి అధికారులకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడంతో అత్యవసర సేవలు అందుబాటులోకి వచ్చాయి కానీ.. పౌరసేవలు మాత్రం పూర్తిస్థాయిలో అందడం లేదు.

పెద్దపల్లి పురపాలికలో వివిధ అంశాలపై నిత్యం 40 నుంచి 50 దరఖాస్తులను అధికారులు స్వీకరిస్తున్నారు.

జనన, మరణ ధ్రువీకరణలతోపాటు పేరు మార్పిడి, ఇంటి అనుమతులు తదితర సమస్యలు అపరిష్కృతంగానే ఉంటున్నాయి.




సుల్తానాబాద్ పురపాలిక కమిషనర్ రెండు నెలలుగా లేకపోవడంతో కార్మికులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

వారం క్రితం పెద్దపల్లి కమిషనర్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడంతో కార్మికులకు వేతనాలు చెల్లించడంతోపాటు అత్యవసర సేవలు అందుబాటులోకి వచ్చాయి. రెండు నెలలుగా జనన, మరణ ధ్రువీకరణల కోసం 87 దరఖాస్తులు రాగా వాటిలో నిర్ణీత గడువు దాటిన తరువాత కూడా 25 దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోలేదు.

మంథని పురపాలిక కమిషనర్ గత నెలలో సరెండర్ కావడంతో ఇన్‌ఛార్జి కమిషనర్‌గా మున్సిపల్ సూపరింటెండెంట్ వ్యవహరిస్తున్నారు. ఆయనకు వారం క్రితం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడంతో పౌరసేవల్లో కొంత వేగం పుంజుకుంది. జనన, మరణ ధ్రువీకరణలతోపాటు ఇంటి పన్ను సంబంధిత సమస్యలపై 106 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దసరా తరువాత దరఖాస్తుల పరిష్కారం పూర్తి చేస్తామని కమిషనర్ మనోహర్ తెలిపారు.

# నీరు దిగలే.. భవిష్యత్తు దిగులే



హైదరాబాద్: గ్రేటర్ వ్యాప్తంగా భూగర్భ జలాల నిల్వలు ఆందోళనకరంగా పడిపోతున్నాయి. ఏయేటికాయేడు కీలక ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాల్లో తగ్గుదల కనిపిస్తోంది. తాజాగా భూగర్భ జలవరుల విభాగం విడుదల చేసిన నివేదిక ప్రకారం...అనేక ప్రాంతాల్లో మీటర్ నుంచి 14 మీటర్ల వరకు తగ్గుదల కన్పిస్తోంది. ప్రధాన నగరం కంటే శివార్లలో తగ్గుదల ఆందోళనకరంగా మారింది. మహానగరం వేగంగా విస్తరించడంతోపాటు భారీ భవనాల నిర్మాణాలు...చెరువుల ఆక్రమణలు...మరోవైపు వాన నీటి సంరరక్షణలో నిర్లక్ష్యం వల్ల ఆ ప్రభావం భూగర్భ జలమట్టాలపై పడుతోంది. కూకట్‌పల్లిలో గతేదాడితో పోల్చితే ఏకంగా 13.72 మీటర్లు కిందికి పడిపోయాయి.

ఇబ్రహీంపట్నంలో 14.83 మీటర్లు భూగర్భ జలమట్టాలు తగ్గాయి. అబ్దుల్లాపూర్ మెట్ ప్రాంతంలో 12.82 మీటర్లు తగ్గుదల కన్పిస్తోంది. ఎంపిక చేసిన ప్రాంతాల్లో భూగర్భ జల విభాగం ఫిజోమీటర్లు ఏర్పాటు చేస్తుంది. అక్కడ నమోదైన వర్షపాతం ఆధారంగా ఈ నీటి నిల్వలు లెక్క కడుతుంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరిలోని 30మండలాల్లో సెప్టెంబరు నెలలో సాధారణ వర్షపాతం కంటే తక్కువే నమోదైంది. సరాసరి 30శాతం వరకు తగ్గుదల కన్పించింది.

వాన నీటి సంరక్షణతోనే..

హెచ్ఎండీఏ ఏరియా...సాధారణ వర్షపాతం లెక్కలోకి తీసుకుంటే ఏటా ఇక్కడ కురిసే వర్షం 15 టీఎంసీలకు సరిసమానం అని నిపుణులు అంచనా. ఇందులో 5శాతం కూడా భూమిలోకి ఇంకించలేని పరిస్థితి.

గతంలో చాలా అపార్ట్‌మెంట్లు, 300 చదరపు మీటర్లు దాటిన వ్యక్తిగత గృహాల్లో ఇంకుడు గుంతలు నిర్మించినప్పటికీ నిర్వహణ లేక పూడుకుపోయాయి. కాలనీలు, పార్కుల్లో ఇంకుడుగుంతలదీ అదే దారి. దీంతో వర్షపు నీరు ఇంకడం లేదు.

శివార్లలో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం జరుగుతోంది. భారీ బోర్లు వేసి అక్కడ భూగర్భ జలాలను తోడేస్తున్నారు. అదే స్థాయిలో వాన నీళ్లు భూమిలోకి చేరక భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. గతంలో జలమండలి, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో భారీఎత్తున ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు. మరోసారి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలి. జలమండలి ఆ దిశగా దృష్టి సారించింది.

సిమెంట్ రహదారులు.. ఎక్కడికక్కడ భారీ నిర్మాణాల వల్ల భూమి లోపలకు నీళ్లు ఇంకడం లేదు. వాన నీరంతా మురుగు కాల్వల ద్వారా మూసీలోకి చేరుతోంది.

# విదేశాలకు స్వదేశీ రుచులు!



కరీంనగర్: విద్య, ఉద్యోగం, ఉపాధి, వ్యాపారం నిమిత్తం ఏటా ఉమ్మడి జిల్లా నుంచి విదేశాలకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఇప్పటికే అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లాంటి దేశాల్లో స్థిరపడిన ఇక్కడి కుటుంబాలు చాలానే ఉన్నాయి. ఈక్రమంలో ఇక్కడి తినుబండారాలు, పచ్చళ్లకు విదేశాల్లో గిరాకీ ఏర్పడింది. అక్కడి ఆహార పదార్థాలు నచ్చక, చేసుకోవడానికి సమయం లేక, ఆరోగ్యం తదితర కారణాలతో ఇక్కడి నుంచి బట్వాడా చేసుకొంటున్నారు. మందులు, వంట సామగ్రి, పప్పులనూ ఇక్కడి నుంచి ఇతర దేశాలకు పంపిస్తుండటంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో కొరియర్ సంస్థలు పెరిగాయి.

తినుబండారాలే అధికం..

అమెరికా, ఇంగ్లాండ్‌లాంటి దేశాల్లో భార్యాభర్తలు ఉద్యోగం చేస్తేనే కుటుంబ పోషణతోపాటు డబ్బు పొదుపు చేసుకోవడానికి వీలుంటుంది. విధులు నిర్వర్తించడం, ఖాళీ సమయం ఎక్కువ ఉండకపోవడంతో, ఆరోగ్యం, రుచులపరంగా ఇంటి నుంచి తెప్పించుకోవడానికి ఎక్కువగా ప్రాధాన్యమిస్తున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల సాయంతో లేదా కొరియర్ ద్వారా తెప్పించుకుంటున్నారు. దీనికి అనుగుణంగా కొరియర్ సంస్థలు ఫెడెక్స్, యూపీఎస్, డీహెచ్ఎల్, ఇతర సంస్థలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకొని పార్సిళ్లను పంపిస్తున్నాయి. ఎక్కువగా పచ్చళ్లు, మిఠాయిలు, పిండి పదార్థాలు, మందులు(మెడిసిన్స్) విదేశాలకు కొరియర్ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రూ.కోట్లలో వ్యాపారం

కిలో పార్సిల్‌కు రూ.2800, 10 కిలోల పైన ఉంటే కిలోకు రూ.660–700 చొప్పున, మందులకు అయితే రూ.3400(500 గ్రాములు) తీసుకుంటున్నారు. విదేశాలకు కొరియర్లు పంపించే వ్యాపారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఏటా రూ.2 కోట్లపైగా జరుగుతుందని చెప్పారు. దసరా, సంక్రాంతి, పచ్చళ్ల సీజన్లలో గిరాకీ అధికంగా ఉంటుందన్నారు. కరీంనగర్‌లో విదేశాలకు పంపే ప్రధాన కొరియర్ సంస్థలు అయిదు ఉన్నాయి.

సీజన్‌లో అధికంగా..

ఎక్కువగా అమెరికాకు పార్శిళ్లు వెళ్తుంటాయి. రోజువారీగా కొరియర్లు తక్కువగానే ఉన్నా సంక్రాంతి, దసరా పండుగలప్పుడు ఎక్కువగా ఉంటాయి. వినియోగదారుడు పార్సిల్ బుక్ చేసుకున్న తర్వాత అతనికి లింక్ పంపిస్తాం. దాని ద్వారా పార్సిల్ ఎక్కడ ఉంది. డెలివరీ అయిందా? అనే వివరాలు తెలుసుకోవచ్చు. మేము 100కు పైగా దేశాలకు వస్తువులు పంపుతుంటాం. గడ్డం విలాస్‌రెడ్డి, కొరియర్ సంస్థ నిర్వాహకుడు

# మక్కలకు అ'ధర'హో..!



వికారాబాద్: భారీ వర్షాలతో నష్టం వాటిల్లి దిగుబడులు తగ్గినా, బహిరంగ విపణిలో మక్కలకు మంచి డిమాండ్ ఉండటంతో రైతులకు ఒకింత ఊరట కలుగుతోంది. జిల్లాలో పంట నూర్పిళ్లు జోరుగా కొనసాగుతూ, ఇప్పుడిప్పుడే మక్కలు విపణికి వస్తున్నాయి. వికారాబాద్ వ్యవసాయ విపణికి 250 క్వింటాళ్ల మక్కలు వచ్చాయి. ప్రభుత్వ మద్దతు ధర కంటే మించి బహిరంగ విపణిలో అధిక ధర పలుకుతోంది. దీంతో రైతులకు కలిసి వస్తోంది.

గతంలో నష్టాల పాలు

మక్కలకు ధర లేకపోవడంతో మొక్కజొన్న సాగు చేపట్టకూడదని 2020లో అధికారులు తేల్చి చెప్పారు. అప్పట్లో బహిరంగ విపణిలో మద్దతు ధర కంటే తక్కువగా క్వింటాలుకు రూ.1,200 నుంచి రూ.1,300 వరకు మాత్రమే పలికింది. రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధర రూ.1,870 కొనుగోలు చేయడంతో ప్రభుత్వానికి భారీగా నష్టం వాటిల్లింది. మొక్కజొన్న సాగు చేయవద్దని అధికారులు ప్రచారం చేసినా కొంతమంది రైతులు సాగు చేపట్టి 2021లో నష్టపోయారు.

నల్ల, ఎర్రరేగడి నేలల్లో ఆశాజనకం: 2022 నుంచి ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువ ఉంటుందని భావించిన రైతులకు అధిక ధర దక్కుతుండటంతో సాగు విస్తీర్ణం ఏయేటికాయేడు పెరుగుతోంది. మొక్కజొన్న సాధారణ దిగుబడి ఎకరాకు 20 క్వింటాళ్లు కాగా, తీవ్ర అతివృష్టి పరిస్థితులతో దిగుబడి ఎకరాకు సగటున 15 క్వింటాళ్లకు పడిపోయింది. వర్షాలకు నీరు నిలిచే ఇసుక, చెల్క, చవుడు భూముల్లో సాగు చేసిన మక్కలకు తీవ్ర నష్టం వాటిల్లి దిగుబడులు సగానికి పైగా తగ్గిపోగా, నల్ల, ఎర్రరేగడి పొలాల్లో మాత్రం ఆశాజనకంగా ఉన్నాయి. వికారాబాద్, పరిగి, తాండూర్, కొడంగల్ నియోజకవర్గాల్లో వరికి బదులుగా మొక్కజొన్నను ఆరు తడి పంటగా సాగు చేశారు. డిమాండ్ ఉండటంతో రానున్న రోజుల్లో మక్కల ధరలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి.


లాభాలు వస్తాయి

రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. రూ.25 వేల పెట్టుబడి పెట్టా. నూర్పిడి చేస్తున్నాం. అధిక వర్షాలకు దిగుబడులు తగ్గి ఎకరాకు 15 క్వింటాళ్ల చొప్పున రావొచ్చని భావిస్తున్నా. బహిరంగ విపణిలో ధర ఆశాజనకంగా ఉండటంతో లాభాలు వస్తాయి. లక్ష్మణ్‌నాయక్, కొటాలగూడ, వికారాబాద్.

# జుడా ఏర్పాటుకు అడుగులు

జగిత్యాల: జగిత్యాల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(జుడా) ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. జుడా ఏర్పాటు చేయాలని ఆరేళ్ల కిందట ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం అన్ని జిల్లాల్లో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో జిల్లాలోనూ ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. మొదట 53 గ్రామాలతో జగిత్యాల, 17 గ్రామాలతో కోరుట్ల, 22 గ్రామాలతో మెట్‌పల్లి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మరోసారి జగిత్యాలలో ఒకటి, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలు 44 గ్రామాలు కలిపి మరో అథారిటీ ఏర్పాటు చేయాలని భావించారు. మరోసారి జిల్లాలోని అన్ని పట్టణాలు, 382 గ్రామ పంచాయతీలను కలిపి ఒకే అథారిటీగా ఏర్పాటు చేయాలని ఆలోచించారు. చివరికి కేవలం జిల్లా కేంద్రంతో పాటు చుట్టు పక్కల 15 కి.మీ పరిధిలోని గ్రామాలను కలిపి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సూచించిన మేరకు జగిత్యాల పట్టణం చుట్టుపక్కల 53 గ్రామాలను కలుపుతూ జుడాను ప్రతిపాదించారు.

ప్రయోజనం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీతో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు కానుంది. సంస్థకు ఛైర్మన్‌ను ప్రభుత్వం నియమిస్తుంది. వైస్ ఛైర్మన్‌గా జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారు. గ్రామపంచాయతీలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. జుడా పరిధిలోని పట్టణం, గ్రామాల్లో ప్రత్యేకంగా అభివృద్ధి



పనులు చేపట్టే వీలుంటుంది. రహదారులు, మురుగుకాలువల నిర్మాణం, వీధిదీపాల ఏర్పాటు తదితర అభివృద్ధికి నిధులు వస్తాయి. అంతేగాకుండా ప్రణాళిక విభాగాన్ని ఏర్పాటు చేస్తారు. బహుళ అంతస్థుల నిర్మాణాలు పరిశ్రమల ఏర్పాటు తదితర అనుమతులన్ని జుడా ఇస్తుంది.

జుడాలో జిల్లా కేంద్రంతోపాటు చుట్టుపక్కల ఏడు మండలాల్లోని 53 గ్రామాలను ప్రతిపాదించారు.

జగిత్యాల పట్టణం, అర్బన్ మండలం: హస్నాబాద్, అంబారిపేట, మోతె, తిప్పన్నపేట, ధరూర్ గ్రామాలు.

పొలాస, హైదర్‌పల్లి, కండ్లపల్లి, చెర్లపల్లి, హన్మాజిపేట, పోరండ్ల, బాలపల్లి, నర్సింగాపూర్, వంజరిపల్లి, వెల్దుర్తి, గొల్లపల్లి, తిమ్మాపూర్, జాబితాపూర్, ధర్మారం, లక్ష్మీపూర్, అనంతారం, చల్‌గల్, తాటిపల్లి, అంతర్గాం, గుట్టరాజ్‌పల్లి, కన్నాపూర్, తక్కళ్లపల్లి, గుల్లపేట, మోరపల్లి గ్రామాలు. సారంగాపూర్ మండలం: పెంబట్ల, కోనాపూర్, లచ్చక్కపేట, నాగునూరు, రంగపేట, లక్ష్మీదేవిపల్లి, అర్పపల్లి.

మేడిపల్లి మండలం: కాచారం, విలాయతాబాద్, మేడిపల్లి, గుండ్లపల్లి, రంగాపూర్, కట్లకుంట, తొంబరావుపేట గ్రామాలు.

మల్యాల మండలం: రాజారం, పోతారం, రామన్నపేట, నూకపల్లి.

గొల్లపల్లి మండలం: బిబిరాజ్‌పల్లి, వెంగళాపూర్, ఇబ్రహీంనగర్, తిర్మలాపూర్. రాయికల్ మండలం: అల్లీపూర్, కిష్టంపేట గ్రామాలను జుడాలో ప్రతిపాదించారు.

అభివృద్ధికి అవకాశంరాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు జగిత్యాల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(జుడా) ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. జిల్లా కేంద్రం సహా చుట్టు పక్కల మండలాల్లోని 53 గ్రామాలను జుడాలో చేర్చాం. జుడా ఏర్పాటుతో గ్రామ పంచాయతీలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. అథారిటీ పరిధిలోని పట్టణం, గ్రామాలు సమగ్రంగా అభివృద్ధి చెందే అవకాశం లభిస్తుంది.

బి.సత్యప్రసాద్, కలెక్టర్

# యంత్రాలు మూలకు.. కార్మికులతోనే పనులు

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పారిశుద్ధ్య పనుల నిర్వహణ, శుభ్రతలో పేరుగాంచింది.. దీని పేరు ఇలాగే కొనసాగించి మరింత మెరుగుపర్చేలా అధికార యంత్రాంగం పని చేయాల్సి ఉండగా.. సమీక్షలు సమావేశాలకే పరిమితమవుతూ వాహనాల మరమ్మతులు అటకెక్కించారు. ఇంకేముంది దీని ప్రభావం కొన్ని నెలలుగా కనిపిస్తోంది. నగరంలోని 60 డివిజన్లలో ఉదయం నుంచి సాయంత్రం వరకు, రాత్రి నుంచి వేకువజామున వరకు రెండు విడతలుగా పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. రహదారులు, మురుగుకాలువలు, చెత్త సేకరణ వంటి పనులు చేస్తుండగా ప్రధాన రహదారులు ఊడ్చేందుకు ప్రత్యేక యంత్రాలను ఉపయోగిస్తారు.

ఏడింటిలో అయిదు..నగరంలో 14.5 కిలోమీటర్ల పొడవునా ఉన్న తారు రోడ్లను రెండు వైపులా ఊడ్చేందుకు ఏడు వాహనాలను ఇన్నాళ్లు వినియోగించారు. కమాన్ నుంచి హైదరాబాద్ రోడ్డు, ఎన్టీఆర్ విగ్రహం నుంచి పద్మనగర్ బైపాసు,



బద్దం ఎల్లారెడ్డి విగ్రహం నుంచి రామగుండం బైపాసు రోడ్డు, కమాన్ నుంచి బస్టాండ్ మీదుగా పద్మనగర్ శివారు వరకు, తెలంగాణ చౌక్ నుంచి ఆర్అండ్‌బీ మీదుగా జగిత్యాల రోడ్డు, కోర్టు చౌరస్తా నుంచి మంచిర్యాల చౌరస్తా మీదుగా చొప్పదండి రోడ్డు, మంచిర్యాల చౌరస్తా నుంచి పెద్దపల్లి రోడ్డు, కమాన్ నుంచి తీగల వంతెన రోడ్డుతోపాటు అంతర్గత వీధుల్లోని తారు రహదారులన్నీ ఊడ్చే యంత్రంతోనే ఊడిపించాల్సి ఉంటుంది. మొత్తం ఏడు వాహనాల్లో పెద్దవి 5, చిన్నవి 2 ఉన్నాయి. ప్రస్తుతం పెద్ద వాహనాలు రెండు మాత్రమే పని చేస్తుండగా ఇవి కూడా ఏ సమయంలో నిలిచిపోతాయో తెలియదు.

ఎందుకింత నిర్లక్ష్యం పారిశుద్ధ్య పనులు చేసే ట్రాక్టర్లు, ఆటోలు, ఊడ్చే యంత్రాలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాల్సి ఉండగా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. అయిదు వాహనాలకు బ్రష్‌లు, బేరింగ్‌లు, సెల్ఫ్ మోటార్లు పాడయ్యాయి. నెలల తరబడి మూలన పడేయడంతో వాటి బ్యాటరీలు కూడా చెడిపోయాయి. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

# వ్యర్థాల శుద్ధిలో వెనకడుగు

సిరిసిల్ల: జిల్లా 2017లో ఓడీఎఫ్‌గా, 2022లో ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ స్థానం దక్కించుకుంది. తర్వాత వాటర్‌ప్లస్ హోదాకు వెళ్లాలి. దీనికి జిల్లాలోని పురపాలికలు, ఎంపిక చేసిన పంచాయతీల్లో మానవ ద్రవ వ్యర్థాల నిర్వహణ, మురుగునీటి శుద్ధి పూర్తిస్థాయిలో జరగాలి. జిల్లాలోని పురపాలికల్లో ఎఫ్‌ఎస్‌టీపీ (ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)లు అందుబాటులో ఉన్నా నిర్వహణలో మాత్రం వెనకనే ఉంది. ఇప్పటికే కేంద్రం నుంచి స్వచ్ఛభారత్ మిషన్ బృందం జిల్లాలో పర్యటించి వివరాలు సేకరించాల్సి ఉంది. ఈ ఏడాది ఆలస్యమైంది. వీటి ఆధారం గానే దేశవ్యాప్తంగా స్వచ్ఛభారత్ ర్యాంకులు ప్రకటిస్తారు. ఈ సారి జిల్లాకు చోటు లభించడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

నీరుగారిన నిర్వహణ

సిరిసిల్ల పురపాలికలో 2019లోనే ఎఫ్‌ఎస్‌టీపీ వినియోగంలోకి వచ్చింది. దీని సామర్థ్యం 18 కేఎల్ (రోజుకు కిలోలీటర్లు). అంటే రోజుకు సగటున 12 వాహనాల మానవ ద్రవవ్యర్థాలు వచ్చినా నిల్వ చేసుకుని శుద్ధి చేసే సామర్థ్యం ఉంది. ప్రస్తుతం 5 కేఎల్ కూడా రావడం లేదు. అంటే పూర్తి సామర్థ్యంలో 30 శాతం కూడా శుద్ధి జరగడం లేదు.ద్రవవ్యర్థాలను సిరిసిల్లలోని ఎఫ్‌ఎస్‌టీపీకి తరలించడం, దాని నిర్వహణను మెప్మాలోని మహిళా సంఘానికి అప్పగించారు. దీనికోసం 2023లో ఎన్‌ఎస్‌కేఎఫ్‌డీసీ (నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) రెండు వాహనాల కొనుగోలుకు రూ.68 లక్షల రుణం మంజూరు చేసింది. ఇంత వరకు బాగానే ఉన్నా ప్రస్తుతం నిర్వహణ లేకపోవడంతో వీటి కొనుగోలుకు తీసుకున్న అప్పులకు బ్యాంకులో వాయిదాలు చెల్లించలేని పరిస్థితి ఉంది.

వేములవాడ పురపాలికలోనూ రూ.60 లక్షల వ్యయంతో జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో ఎఫ్‌ఎస్‌టీపీని నిర్మించారు. రెండేళ్లుగా పనులు చివరి దశలోనే నిలిచిపోయాయి. కారణం గుత్తేదారుకు ప్రభుత్వం నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక్కడ నిర్వహణ బాధ్యతలు కూడా గుత్తేదారు సంస్థదే ఉంటుంది. దీని తర్వాత ట్రయల్ రన్ చేయాలి.పురపాలికలు, పంచాయతీల్లో మరుగుదొడ్ల ట్యాంకులను శుభ్రం చేసుకోవడంపై స్వచ్ఛభారత్ మిషన్ సిబ్బందితోపాటు స్థానిక అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలి. అక్కడే శుభ్రం చేసుకునే విధానాన్ని వివరించేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారం అవసరం. ప్రతి మూడేళ్లకోసారి జరగాలి. ఇలా చేయడం వల్ల వాటి జీవితకాలం పెరగడంతోపాటు భూగర్భ జలాలు కలుషితం కాకుండా ఉంటాయి. కానీ వీటిపై అవగాహన లేక శుభ్రతకు ముందుకు రావడం లేదు.

‘స్వచ్ఛభారత్ మిషన్‌తో దేశ శ్రేయోభివృద్ధికి సరికొత్త మార్గం ఏర్పడింది.



21వ శతాబ్దంలో విజయవంతమైన ప్రజా ఉద్యమం. పరిశుభ్రత వారసత్వంగా మారాల్సిన అవసరం ఉందని, దీని ప్రభావం ప్రజారోగ్యంపైన, వారి జీవన విధానాలపైన సానుకూల ప్రభావం చూపిస్తుంది.’ అక్టోబరు 2న స్వచ్ఛ భారత్ మిషన్‌ను ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ అన్న మాటలు ఇవి.

బ్యాంకు వాయిదాలు చెల్లించలేని పరిస్థితి2023 మార్చిలో రూ.34 లక్షల బ్యాంకు రుణంతో మానవ ద్రవ వ్యర్థాలను తరలించే వాహనాన్ని కొనుగోలు చేశాం. ప్రతి నెలా సగటున రూ.80 వేల ఆదాయం ఉంటేనే బ్యాంకుకు చెల్లించాల్సిన అసలు, వడ్డీ పోనూ రూ.20 వేల ఆదాయం ఉంటుంది. దీనిపై ప్రజలకు అవగాహన లేక ప్రస్తుతం నెలకు రూ.25 వేలకు మించి రావడం లేదు. బ్యాంకు వాయిదాలకు అదనంగా రూ.15 వేలు కలిపి కట్టాల్సి వస్తుంది. దీనికి తోడు ఎఫ్‌ఎస్‌టీపీలో పని చేసే నలుగురు ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఉంది.జమున, ఎఫ్‌ఎస్‌టీపీ నిర్వాహకురాలు

# క్రమబద్ధీకరణలో నిర్లక్ష్యం.. కారణాలనేకం!

గోదావరిఖని : ‘నాలుగేళ్ల నుంచి లక్షలమంది లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్‌ఆర్‌ఎస్)కు ఎదురుచూస్తున్నారు. దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ చురుగ్గా సాగడం లేదు. కలెక్టర్లు ఉదాసీనంగా ఉండటం సరికాదు. వెంటనే దృష్టి సారించాలి’.ఈ నెల 1న జిల్లా పాలనాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు.

నాలుగేళ్ల క్రితం నిర్ణీత గడువులోగా జిల్లాలోని పట్టణాల్లో 19,178.. గ్రామీణ ప్రాంతాల్లో 6,273 దరఖాస్తులురాగా వాటి పరిష్కారం నత్తనడకన సాగుతుంది. ప్రస్తుతం మంత్రి ఆదేశాల మేరకు.. ఆయా దరఖాస్తులను పరిశీలించి ఎప్పటికప్పుడు ఆయా దరఖాస్తుదారులకు స్వయంగా ఫోన్ చేసి నిర్ణీత రుసుం చెల్లించి సంబంధిత స్థలాన్ని క్రమబద్ధీకరించుకోవాలని అధికారులు కోరుతున్నా.. స్పందన నామమాత్రంగానే ఉంటుంది.చెల్లింపునకు వెనుకంజ అన్ని దస్త్రాలు సవ్యంగా ఉన్నప్పటికీ నిర్ణీత రుసుం చెల్లించలేక స్థలాలను క్రమబద్ధీకరించుకోలేనివారు కొందరైతే.. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ప్రక్రియ నాలుగేళ్ల క్రితం నాటిది. గడిచిన సమయంలో ఇప్పటికే సంబంధిత స్థలం ఇద్దరు, ముగ్గురి చేతులు మారడం(క్రయ, విక్రయాలు)తో మొదట దరఖాస్తు చేసుకున్న వ్యక్తి.. ఇప్పుడా స్థలం యజమాని కాకపోవడంతో స్పందించడం లేదు.

అత్యధిక దరఖాస్తులు వివిధ కారణాలతో ఎల్‌ఆర్‌ఎస్ పరిధిలోకి రాకుండా నిషేధిత జాబితాలో చేరాయి. దరఖాస్తుదారులు సంబంధిత శాఖాధికారులను సంప్రదించి ఆయా స్థలం.. నిషేధిత జాబితాలో లేనట్లుగా నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తికానుంది. ఇప్పటికే కొందరు జరిమానాతో రుసుం చెల్లించి ప్రభుత్వ అనుమతి తీసుకొని భవనాలు నిర్మించుకున్నారు. నాలుగేళ్ల క్రితం వీరు సమర్పించిన దరఖాస్తులు ఇప్పుడు పెండింగ్ జాబితాలో ఉన్నాయి. అప్పుడు హడావుడిగా కేవలం రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసినవారు.. ప్రస్తుతం నిర్ణీత రుసుం చెల్లించేందుకు వెనుకంజ వేస్తున్నారు.ప్రత్యేక మొబైల్ యాప్..ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను రూపొందించారు. దీనిలో భాగంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, నీటిపారుదలశాఖ ఏఈ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు ప్రత్యేకంగా దరఖాస్తుల ప్రక్రియలో లాగిన్ సదుపాయం కల్పించారు.ప్రక్రియ వేగవంతం చేస్తున్నాం..మనోహర్, కమిషనర్, మంథని మున్సిపాలిటీ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు ఆయా శాఖల అధికారుల సమన్వయంతో ముందుకు సాగుతున్నాం. మరోవైపు దరఖాస్తుదారుల్లో అవగాహన పెంచేందుకు కృషి చేస్తున్నాం. ఆమోదం పొందిన దరఖాస్తుదారులను నిర్ణీత రుసుం చెల్లించాల్సిందిగా కోరుతున్నాం.

# పరిహారంపై మల్లగుల్లాలు



హైదరాబాద్: మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా నిర్వాసితులకు పరిహారం చెల్లించే విషయంలో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఇందుకు సుమారు రూ.12 వేల కోట్లకు పైగా అవసరమని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఇంత పెద్దమొత్తం నిర్వాసితుల మీదే వ్యయం చేయడం చాలా కష్టమైన విషయమని సీనియర్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ ఖజానాలో మూసీకి పెద్దఎత్తున నిధులను కేటాయించే పరిస్థితి లేదని చెబుతున్నారు.

రుణం వస్తే ఊరట మూసీ ప్రాజెక్టు కోసం రుణానికి వివిధ ఆర్థిక సంస్థలతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. ఇందుకు రూ.50 వేల కోట్ల మేర రుణం తీసుకోవాలని అనుకుంటోంది. ఈ మొత్తం మంజూరైతే నిర్వాసితులకు పరిహారం ఇచ్చే అవకాశం ఉంటుందని అంటున్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టును వచ్చే మూడేళ్లలో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై ఎన్ని విమర్శలు వచ్చినా ఈ ప్రాజెక్టును పూర్తి చేసి తీరుతామని సీఎం రేవంత్‌రెడ్డి పలు సభల్లో కుండబద్దలు కొట్టారు. క్షేత్రస్థాయిలో మాత్రం అవంతరాలు ఎదురవుతున్నాయి.బఫర్‌లో 15 వేల ఆక్రమణలు

మంచిరేవుల నుంచి నాగోలు వరకు 55 కి.మీ.ల పొడవున మూసీని సుందరీకరణతోపాటు ఆరు వరుసల రహదారి, మెట్రో సౌకర్యం కల్పించాలని ప్రణాళిక రూపొందించారు. దీనికి రూ.50 వేల కోట్లు అవసరమని అంచనా వేశారు. దాదాపు 15 వేల ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించారు. వాస్తవంగా మొత్తం చిన్నాపెద్దా నిర్మాణాలు దాదాపు 22 వేల వరకు ఉంటాయని చెబుతున్నారు. నదీ గర్భంలో ఉంటున్న 1600 మందికి రెండు పడక గదులను ఇవ్వాలని నిర్ణయించారు. దీనికి 80 శాతం మంది అంగీకరించారు.

అపార్ట్‌మెంట్ల వాసుల అనాసక్తి బఫర్ జోన్‌లో దాదాపు 5 వేల మందికిపైగా నిర్మాణదారులు బల్దియా నుంచి అనుమతులు తీసుకుని ఇళ్లను నిర్మించారు. ఇందులో అపార్టుమెంట్లూ ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చే పరిహారంతో న్యాయం జరగదని వీరు ఖాళీ చేయడానికి ముందుకు రావడం లేదు. అత్తాపూర్ నుంచి బాపూఘాట్‌కు వెళ్లే ప్రాంతంలో ఒకేచోట ఓ బిల్డర్ మూడేళ్ల కిందట 30 ఫ్లాట్లతో కూడిన అపార్టుమెంట్, ఆరు విల్లాలను నిర్మించారు. ఒక్కో ఫ్లాట్‌ను రూ.70 లక్షలకు, విల్లాలను కోటిన్నరకు విక్రయించారు. ప్రభుత్వం వీరికి ఇచ్చే పరిహారం 40 శాతం కూడా రావడం లేదు. వీరికి ఎలా న్యాయం చేయాలన్న దానిపై ప్రణాళిక లేదు. నగరంలో స్థలాన్ని సేకరించి వంద గజాల నుంచి ఆపైన పరిహారంగా ఇచ్చే విషయాన్నీ ప్రభుత్వం పరిశీలిస్తోంది.

# గురుకుల హబ్‌గా కొడంగల్



పరిగి : ప్రభుత్వం విద్యా వ్యవస్థకు పెద్దపీట వేస్తోంది. అందులో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌ను ‘గురుకుల హబ్’గా మారుస్తోంది. దీనికోసం మొదటి విడతగా రూ.73.45 కోట్లను విడుదల చేసింది. మరో రూ.70 కోట్లు రెండో విడత మంజూరు చేస్తారని అధికారులు పేర్కొంటున్నారు. మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ గ్రామంలో గిరిజన గురుకుల పాఠశాల పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో బీసీ బాలుర జూనియర్ కళాశాల, బొంరాస్‌పేట మండలం బురాన్‌పూర్ వద్ద బీసీ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల, అలాగే ప్రస్తుతం కొనసాగుతున్న బీసీ బాలుర గురుకులానికి అదనపు గదులు, మౌలిక సదుపాయాలు ఇలా అన్నింటికి కలిపి ప్రత్యేకంగా ఈ నిధులు వెచ్చిస్తారు. దీంతో దూర ప్రాంతంలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకుల పాఠశాలలు కొడంగల్‌కు రానున్నాయి.

మౌలిక వసతుల కల్పనకు అవకాశంకొడంగల్ పట్టణ శివారులో 132 సబ్‌స్టేషన్ పక్కనే మహాత్మ జ్యోతిబా ఫులే బాలుర గురుకుల పాఠశాల 15 సంవత్సరాలుగా కొనసాగుతోంది. విద్యార్థులకు సొంత భవనం నిర్మించినా, ఉపాధ్యాయులు ఉండేందుకు వసతులు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రస్తుతం గురుకుల పాఠశాలకు రూ.23.45 కోట్లు విడుదల చేయడంతో మౌలిక వసతులు కల్పించేందుకు వీలు కలుగుతోంది.

మొయినాబాద్‌లో అద్దె భవనంలో కొనసాగింపు

కొడంగల్‌కు బీసీ గురుకుల కళాశాల 5 సంవత్సరాల క్రితం మంజూరు కావడంతో కొంత కాలం పాఠశాల గదుల్లోనే కొడంగల్‌లో నిర్వహించారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో మొయినాబాద్‌లోని కనకమామిడి వద్ద అద్దె భవనంలోకి మార్చారు.బాలుర గురుకుల కళాశాలకు రూ.25 కోట్లు విడుదల కావడంతో పాత కొడంగల్ గ్రామంలో నిర్మాణం పనులు చేపట్టనున్నారు.బొంరాస్‌పేట మండలం బురాన్‌పూర్ గ్రామానికి మంజూరైన బీసీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలకు సొంత భవనం లేదు. దీంతో చేవేళ్ల సమీపంలోని ఊరెళ్లలో అద్దె భవనంలో నిర్వహిసున్నారు. సొంత భవనానికి రూ.25 కోట్లు విడుదలయ్యాయి.ఎక్కడవి అక్కడే నిర్మాణం అవుతాయిబీసీ బాలికల పాఠశాల, కళాశాలలు రెండు బొంరాస్‌పేట మండలం బూరాన్‌పూర్ వద్దనే నిర్మిస్తారు. అలాగే బీసీ బాలుర గురుకుల పాఠశాల మాత్రం మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ వద్ద నిర్మిస్తారు. ప్రస్తుతం బాలుర ఉన్నత పాఠశాలకు సంబంధించి 132సబ్‌స్టేషన్ పక్కనే ఏర్పాట్లు చేస్తారు.వెంకట్‌రెడ్డి, ‘కడా’ కార్యాలయం ప్రత్యేక అధికారి, కొడంగల్.

# మునుగుతోందా.. ముంచుతున్నారా..?



హైదరాబాద్: నాలాల్లో పూడిక తొలగించకపోవడంతో నగరంలోని పలు ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. కొన్నేళ్లుగా నాలాల్లోని పూడిక తీయడం లేదు. దీంతో క్రమంగా నాలాల్లోని బురద మట్టి మ్యాన్‌హోళ్ల మూతవరకు పేరుకుపోయింది. చివరికి వాటి మూత దాటి నాలాలోకి చుక్కనీరు చేరని పరిస్థితి. సికింద్రాబాద్ చిలకలగూడ చౌరస్తా నుంచి సీతాఫల్‌మండి రోడ్డు వైపు వరద నాలాను తవ్వడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. జీహెచ్‌ఎంసీ మాత్రం ఏటా పూడికతీత పనులకు రూ.50కోట్ల మేర వెచ్చిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది.మొండికేస్తున్న మూతలు.. చిలకలగూడ చౌరస్తా నుంచి రైల్వే క్వార్టర్స్ రోడ్డు మీదుగా గాంధీ చౌరస్తా వరకు చిన్న వర్షం కురిసినా రోడ్డు మునుగుతోంది. గాంధీ సర్కిల్ వరకు వరద రోడ్డు మీదుగానే ప్రవహించి నాలాలో కలుస్తుంది. స్థానికుల ఫిర్యాదుతో తాజాగా జీహెచ్‌ఎంసీ నాలా పునరుద్ధరణ పనులను చేపట్టింది. తెలిగ్గా తెరచుకోవాల్సిన మ్యాన్‌హోళ్ల మూతలు మొండికేశాయి. పేరుకుపోయిన మట్టి వాటిని పట్టేశాయి. అప్పటి వరకు 20 మ్యాన్‌హోళ్లను తెరిచామని, గాలి దూరేందుకు కూడా సందులేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

నిధుల మేతగా పూడికతీత..

జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టే పూడికతీత పనులు మొదట్నుంచీ గందరగోళమే. ఇటీవల టెండర్లలో కూకట్‌పల్లి జోన్, శేరిలింగంపల్లి జోన్ల సీనియర్ ఇంజినీరింగ్ అధికారులు బినామీ గుత్తేదారులను రంగంలోకి దించుతున్నారు. ఈ క్రమంలో కొందరు గరిష్ఠంగా 40శాతం తక్కువ ధరకే చేస్తామంటున్నారు. పూడిక మట్టిని జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుకు తరలిస్తేనే పూర్తిగా బిల్లును చెల్లించాలనే నిబంధన ఉంది. యార్డుకు వెళ్లే ప్రైవేటు వ్యర్థాలు, శివారు మున్సిపాలిటీల్లోని చెత్త వాహనాల ‘వే బ్రిడ్జి’ టోకెన్లను పూడికతీత గుత్తేదారులు కొనుగోలు చేసి జీహెచ్‌ఎంసీ వద్ద బిల్లులు తీసుకుంటున్నారు.

# కాపర్ ల్యాండ్‌లైన్లకు.. కాలం చెల్లినట్లేనా?

హైదరాబాద్:నగరంలో ఇప్పటికీ ల్యాండ్‌లైన్ ఫోన్లను ఇళ్లు, కార్యాలయాల్లో వినియోగిస్తున్నారు. వీటిలో 40వేల దాకా బీఎస్‌ఎన్‌ఎల్‌కు చెందిన కాపర్ ఆధారిత కనెక్షన్లు ఉన్నాయి. బ్రాడ్‌బ్యాండ్ సేవలకు కూడా వినియోగిస్తున్నారు. మెరుగైన సేవల కోసం వీటిని ఫైబర్‌లోకి మార్చుకోవాలని వినియోగదారులను బీఎస్‌ఎన్‌ఎల్ కోరుతుంది.నిర్వహణ కష్టమని.. : గ్రేటర్‌లో బీఎస్‌ఎన్‌ఎల్‌కు విస్తృతమైన ఫైబర్ నెట్‌వర్క్ ఉంది. ఫైబర్ టూ ద హోమ్ పేరుతో బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు ఇస్తోంది. అదే సమయంలో తొలినాళ్లలో వేసిన కాపర్ ఆధారిత నెట్‌వర్క్ కల్గిన కనెక్షన్లు సిటీలో ఉన్నాయి. వీటిలో



నెట్‌వర్క్ లోపాలపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయి. నిర్వహణ కూడా బీఎస్‌ఎన్‌ఎల్‌కు సవాల్‌గా మారింది. కాబట్టి కాపర్ నుంచి ఫైబర్‌కు మారాలని వినియోగదారులను అభ్యర్థిస్తుంది.

సానుకూలతల దృష్ట్యా.. కాపర్‌తో పోలిస్తే ఫైబర్‌లో ఎక్కువ ప్రయోజనాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అధిక బ్యాండ్‌విడ్త్ కల్గి ఉండటం, సిగ్నల్ లోపాల సమస్యలు తక్కువ. అయితే కాపర్ నుంచి ఫైబర్‌కు మారాలంటే ప్యాకేజీలను ఎంపిక చేసుకోవాలి. కాపర్ నుంచి ఫైబర్‌కు మారేందుకు ఎలాంటి సర్వీస్ ఛార్జీలు ఉండవని బీఎస్‌ఎన్‌ఎల్ చెబుతోంది.

4జీ నెట్‌వర్క్ నవీకరణ..

హైదరాబాద్ బిజినెస్ ఏరియా పరిధిలో 1500 ప్రాంతాల్లో టవర్లను 4 జీ నెట్‌వర్క్‌లోకి నవీకరిస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి 4జీ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని బీఎస్‌ఎన్‌ఎల్ ప్రయత్నిస్తోంది. మరిన్ని సేవల ఆధునికీకరణపై దృష్టి పెట్టినట్లు అధికారులు తెలిపారు.

# నిర్వహణ గాలికి

ఉంగుటూరు : 20 ఏళ్ల క్రితం ప్రారంభించిన తాడిపూడి ఎత్తిపోతల పథకం నేటికీ కొలిక్కి రాకపోగా అసంపూర్తి పనులతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఏటా ఒక పంటకి కూడా సాగు నీరు అందక నానా కష్టాలు పడుతున్నారు. దీంతో పథకం లక్ష్యం నీరుగారిపోతోంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో 2004లో పథకాన్ని ప్రారంభించారు. 2.06 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంగా రూ.885.538 కోట్ల అంచనా వ్యయంతో 5 దశలుగా పనులు విభజించి నిర్మాణం చేపట్టారు. రెండు దశాబ్దాలు గడుస్తున్నా ప్రధాన కాలువ పనులు పూర్తికాలేదు. ప్రధాన కాలువ పొడవు 80.45 కి.మీ.తవ్వాలి. ఉపకాలువలు 31కి 14 మాత్రమే పూర్తయ్యాయి. సబ్‌లిఫ్టులు అయిదింటికి ఒకటి మాత్రమే పూర్తైయింది. ఇప్పటి వరకు రూ.626.974 కోట్లు ఖర్చైంది. తెదేపా ప్రభుత్వ హయాంలో 80 శాతం పనులు పూర్తయ్యాయి. ఏలూరు జిల్లాలో దెందులూరు, ద్వారకాతిరుమల మండలాల్లో అరకొరగా కాలువలు తవ్వడంతో రైతులు ఉపయోగం లేకుండా పోయింది.

తాడిపూడి కాలువ నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంది.పర్యవేక్షణ



లేకపోవడంతో సాగునీటి కోసం అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. ఉంగుటూరు మండలంలోని నీలాద్రిపురం, గొల్లగూడెం, కంసాలి గుంట మీదుగా తాడిపూడి కాలువ ప్రవహిస్తోంది. దీనికి మూడు ఉప కాలువలు ఉన్నాయి. నిర్వహణ లేక అస్తవ్యస్తంగా మారింది. పోలసానిపల్లి ఎర్ర చెరువు వద్ద ఉప కాలువ ఆక్రమణకు గురైంది. భూసేకరణలో భాగంగా భూయజమానులు పరిహారం సరిపోదని కోర్టును ఆశ్రయించారు. కాలువ పనులు పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరు కాగానే పనుల ప్రారంభిస్తామని ఎస్ఈ దేవ ప్రకాశ్ తెలిపారు.

# చెరువూ చెరువూ ఎక్కడున్నావ్?

హైదరాబాద్: గ్రేటర్ వ్యాప్తంగా గత పదేళ్లలో అనేక నీటి వనరులను ఆక్రమణదారులు మాయం చేశారు. తాజాగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విడుదల చేసిన శాటిలైట్ మ్యాపులతో కూడిన నివేదిక ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఇలానే వదిలిస్తే మరో పదేళ్లలో అవుటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న చెరువులు పూర్తిగా అన్యాక్రాంతం కావడం ఖాయంగా కనిపిస్తోంది. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు గ్రేటర్‌లో 225 చెరువులు పూర్తిగా అన్యాక్రాంతమయ్యాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో వేరే చెప్పాల్సిన అవసరం లేదు. మరో 196 పాక్షికంగా ఆక్రమించేశారు. ఇదంతా అవుటర్ రింగ్‌రోడ్డు లోపల జరిగిన ఆక్రమణల తంతు. అవుటర్ అవతల ప్రస్తుతం చెరువుల చుట్టూ అనేక భారీ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లు ఆక్రమించి నిర్మాణాలు కడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా 2014 నాటికి అసలు ఆక్రమణలు లేని చెరువులు సైతం గత పదేళ్లలో ఆక్రమించేశారు. 20 చెరువుల్లో పూర్తిగా, మరో 57 చెరువుల్లో పాక్షికంగా ఆక్రమణలు ఉన్నట్లు తాజాగా శాటిలైట్ మ్యాపులు ద్వారా తెలుస్తోంది. చెరువుల్లోని ఎఫ్‌టీఎల్‌ల్లో కబ్జాలపై హైడ్రా దృష్టి సారించిన సంగతి తెలిసిందే. చాలా చోట్ల కూల్చివేతలు కూడా చేపట్టింది. 2014కు ముందు శాటిలైట్ మ్యాపుల్లో ఆక్రమణలు లేకపోయినా సరే...తర్వాత కాలంలో దారుణంగా ఆక్రమణలకు పాల్పడిన వైనం తేటతెల్లమైంది. దీంతో వేరే దారి లేక వరద నీరంతా సమీపం కాలనీలు, ఇళ్లల్లోకి ముంచెత్తుతోంది. పెద్దపెద్ద నీటి కుంటలను సైతం నామ రూపాలు లేకుండా అన్యాక్రాంతం చేసుకొని పెద్దపెద్ద నిర్మాణాలు చేపట్టారు. కొన్నిచోట్ల చెరువులు ఆక్రమించి లేఅవుట్లు వేసిన వైనం బయట పడింది. 2014 తర్వాత పలు చెరువుల ఆక్రమణల బయట పెట్టాయి.



# రతన్ టాటా మృతికి ఏపీ క్యాబినెట్ సంతాపం.. అజెండాపై చర్చ వాయిదా

అమరావతి: ఏపీ సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ భేటీ ముగిసింది. అజెండా అంశాలపై చర్చను క్యాబినెట్ వాయిదా వేసింది. రతన్ టాటా మృతికి సంతాపం ప్రకటించింది. భేటీకి ముందు ఆయన చిత్రపటం వద్ద సీఎం చంద్రబాబు, మంత్రులు నివాళి అర్పించారు.  సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ముంబయికి బయలుదేరి వెళ్లారు. రతన్ టాటా పార్థివ దేహానికి వారు నివాళులర్పించారు. ముంబయిలోని ఎన్‌సీపీఏ గ్రౌండ్‌లో రతన్ టాటా పార్థివ దేహాన్ని ప్రజలు, ప్రముఖుల సందర్శనార్థం ఉంచారు.




# రతన్ టాటా భౌతికకాయానికి చంద్రబాబు నివాళి

ముంబయి: దిగ్గజ పారిశ్రామికవేత్త, పద్మవిభూషణ్ గ్రహీత, టాటా సన్స్ సంస్థ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా భౌతికకాయానికి ఏపీముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ నివాళులర్పించారు.

ముంబయిలోని ఎన్‌సీపీఏ గ్రౌండ్‌లోని పార్థివదేహం ఎదుట పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు. టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌తోపాటు, గ్రూప్ ఉన్నతాధికారులు, టాటా కుటుంబ సభ్యులతో చంద్రబాబు మాట్లాడారు. వారికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. రతన్ టాటా లాంటి మహోన్నతమైన వ్యక్తి ఈ లోకాన్ని వీడిపోవడం తీరని లోటన్నారు.



# సూర్య - చంద్ర ప్రభ వాహనాలపై దర్శనమిచ్చిన శ్రీవారు





తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాలు తిరుమలలో వైభవంగా సాగుతున్నాయి. గురువారం ఉదయం స్వామివారు మాడ వీధుల్లో సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ వేడుకను వీక్షించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. సూర్యుడు తేజోనిధి, సకల రోగ నివారకుడు. ప్రకృతికి చైతన్యప్రదాత. వర్షాలు, వాటి వల్ల పెరిగే చెట్లు, చంద్రుడు, అతని వల్ల పెరిగే సముద్రాలు మొదలైనవన్నీ సూర్యతేజం వల్లనే వెలుగొందుతున్నాయి. సూర్యప్రభ వాహనంపై శ్రీనివాసుని దర్శనం వల్ల ఆరోగ్య, విద్య, ఐశ్వర్యం, సంతానం వంటి ఫలాలు భక్తకోటికి సిద్ధిస్తాయని నమ్మకం. ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం మలయప్పస్వామి వారు చంద్రప్రభ వాహనంపై విహరించి భక్తకులకు అభయమిచ్చారు.

చంద్రుడు శివునికి శిరోభూషణమైతే ఇక్కడ శ్రీహరికి వాహనంగా ఉండడం విశేషం. చంద్రోదయం కాగానే కలువలు వికసిస్తాయి. సాగరుడు ఉప్పొంగుతాడు. చంద్రప్రభ వాహనంపై స్వామిని చూడగానే భక్తుల మనసు ఉప్పొంగుతుంది.

# కుట్రలకు కేరాఫ్ ఆ పార్టీ.. వైఎస్ షర్మిల ఆన్ ఫైర్..

అమరావతి, అక్టోబర్ 10: ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల మరోసారి రెచ్చిపోయారు. కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన ఆమె.. అంతే స్థాయిలో కౌంటర్ ఇచ్చారు. పచ్చ కామెర్లోడికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు ప్రధాని మోడీ తీరు ఉందంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. దేశంలో విద్వేషాలను రెచ్చగొట్టేది, కుల,మతాల మధ్య చిచ్చు పెట్టేది, విభజన రాజకీయాలు చేసేది బీజేపీనే అని విమర్శలు గుప్పించారు. కుట్ర రాజకీయాలకు కేరాఫ్ బీజేపీ అంటూ ఫైర్ అయ్యారు. మత రాజకీయాలకు జన్మస్థలం బీజేపీ అని అన్నారు. మతాన్ని కవచంలా అడ్డుపెట్టుకుని దర్జాగా దేశాన్ని దోచుకుంటోందంటూ విమర్శలు గుప్పించారు షర్మిల. దోస్తులకు సంపదను దోచిపెడుతూ.. కాంగ్రెస్‌ను విద్వేషాల ఫ్యాక్టరీ అని మోడీ అనడం, దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుందన్నారు. చావు తప్పి కన్ను లొట్టపోయినట్లుంది హర్యానాలో బీజేపీ విజయం అని షర్మిల సెటైర్లు వేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడినా.. ప్రజల మనసులో బలంగా నాటిన ప్రేమ, ఐక్యత సందేశం క్రమంగా ఉద్యమంగా, ఉప్పెనగా మారుతోందని బీజేపీ తెలుసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ.. ప్రజలను ప్రజల మనసులను గెలిచిందనే విషయాన్ని బీజేపీ గ్రహించాలన్నారు. నఫ్రత్ - మొహబ్బత్‌కు మధ్య జరిగిన యుద్ధంలో ప్రేమనే గెలిచిందన్నారు షర్మిల. జమ్మూకాశ్మీర్‌లో తెరుచుకున్న 'మొహబ్బత్ కి దుకాణ్' లు రేపటి రోజున దేశం మొత్తం తెరుచుకుంటాయన్నారు. మోడీ హఠావో.. దేశ్ బచావో అనే నినాదం నిజమవుతుందన్నారు. 10 ఏళ్లుగా దేశం వెలుగుతుందని పచ్చి అబద్ధాలు చెప్తున్న మోడీ.. 'విశ్వగురు కాదు.. విష పురుగు' అని ప్రజలకు అర్థం అవుతోందంటూ తీవ్ర వ్యాఖ్యాలు చేశారామె. విద్వేషాన్ని పెంచేది మోడీ.. ప్రేమను పంచేది రాహుల్ అని అన్నారు. 'బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తులు రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడులు చేస్తుంటే.. కుల, మతాల మధ్య విభజన తెచ్చి ఊచకోత కోస్తుంటే.. ఎదిరించిన గొంతుకలను, నక్సల్స్, టెర్రరిస్టులు, హిందూ వ్యతిరేకులుగా పోల్చుతుంటే.. హక్కుల పరిరక్షణకు, కాంగ్రెస్ మాత్రమే ప్రత్యామ్నాయం అని దేశం నమ్ముతుంది. ఈ నమ్మకమే 2029లో దేశాన్ని కాంగ్రెస్ నిలబెడుతుంది. ప్రధానిగా రాహుల్ గాంధీని దేశం చూస్తుంది. అన్ని వర్గాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం. కాంగ్రెస్ అందించేది ఆపన్న హస్తం, వాడిపోవటానికి అతి చేరువలో ఉన్నది కమలం.' అంటూ తనదైన శైలిలో కామెంట్స్ చేశారు షర్మిల.



# సుంకర రాజేంద్రప్రసాద్ సతీమణి భౌతికకాయానికి పలువురి నివాళి

విజయవాడ: ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ సతీమణి జ్యోత్స్న భౌతికకాయం వద్ద పలువురు నివాళులర్పించారు. రాజస్థాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో జ్యోత్స్న మృతిచెందిన విషయం తెలిసిందే. విజయవాడలో ఆమె భౌతికకాయానికి సీపీఎం నేత బీవీ రాఘవులు, పలువురు న్యాయవాదులు నివాళులర్పించి.. పలు ఉద్యమాల్లో ఆమె కృషిని గుర్తుచేసుకున్నారు. అనంతరం మంగళగిరిలోని ఎన్ఆర్ఐ ఆస్పత్రికి జ్యోత్స్న భౌతికకాయాన్ని తరలించారు. మృతదేహాన్ని కుటుంబసభ్యులు ఆ ఆస్పత్రికి అందజేయనున్నారు.






# రతన్ టాటా మృతి పట్ల పవన్, లోకేష్ సహా ప్రముఖుల నివాళులు..

అమరావతి: ప్రముఖ పారిశ్రామిక వేత్త, మానవతావాది రతన్ టాటా మరణం పట్ల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ సహా పలువురు మంత్రులు సంతాపం తెలిపారు. పవన్ మాట్లాడుతూ.. ప్రముఖ పారిశ్రామికవేత్త, టాటా సన్స్ గ్రూప్ ఛైర్మన్, పద్మ విభూషణ్ రతన్ టాటా మరణం భారతదేశానికి తీరని లోటని.. భారత పారిశ్రామిక రంగానికే కాదు.. ప్రపంచ పారిశ్రామిక రంగానికి రతన్ టాటా ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన నేతృత్వంలో ఉప్పు నుండి మొదలుకొని, విమానయాన రంగంలో వరకు భారత దేశపు అణువణువులో టాటా అనే పేరు ప్రతిధ్వనించేలా వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారని కొనియాడారు. ఆయన హయాంలో టాటా అంటే భారతదేశపు ఉనికిగా అంతర్జాతీయ సమాజం ముందు నిలబెట్టారని, కేవలం పారిశ్రామిక వేత్తగా కాకుండా గొప్ప మానవతావాదిగా ఆయన సమాజానికి చేసిన సేవలు అనిర్వచనీయమని అన్నారు. ఈ బాధాకరమైన సమయంలో తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, టాటా గ్రూప్ సంస్థల కుటుంబ సభ్యులకు, ఆయన అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రతన్ టాటా అనే పేరు ఎప్పటికీ చరిత్రలో నిలిచిపోతుందని, ప్రతీ తరానికి ఆదర్శప్రాయంగా నిలచిన మహోన్నత వ్యక్తికి అంతిమ వీడ్కోలు తెలియజేస్తున్నానని పవన్ పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. విలువలు, మానవత్వంతో కూడిన వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించిన మహా దార్శనికుడు రతన్ టాటా అని, దేశాభివృద్ధి, ప్రజా శ్రేయస్సు, ఉద్యోగుల సంక్షేమమే పరమావధిగా టాటా గ్రూప్ సంస్థలను దశాబ్దాలుగా అదే నిబద్ధతతో నిర్వహించిన పద్మవిభూషణ్ రతన్ టాటా సేవలు చిరస్మరణీయమని అన్నారు. టాటా గ్రూప్ ఉత్పాదనలు వాడని భారతీయులు ఉండరని, మన దేశంలో ఏ మూల ఏ విపత్తు సంభవించినా భారీ విరాళంతో స్పందించే మానవత్వపు హృదయం రతన్ టాటాదని, నిజాయితీని, నిస్వార్థపరత్వాన్ని టాటా బ్రాండ్‌గా చేసిన రతన్ టాటాకు మరణం లేదని ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా జీవించే ఉంటారని అన్నారు. నమ్మకమైన టాటా ఉత్పత్తుల రూపంలో ప్రతి ఇంట్లోనూ మనందరినీ ప్రతిరోజూ చిరునవ్వుతో పలకరిస్తూనే ఉంటారని.. రతన్ టాటా నిరుపమానమైన సేవలను స్మరిస్తూ, అశ్రు నివాళులు అర్పిస్తున్నానని మంత్రి లోకేష్ అన్నారు.

# రతన్ టాటా జీవితం అందరికీ ఆదర్శం.. ఏపీ మంత్రులు



అమరావతి, అక్టోబర్ 10: ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా మంత్రులు సంతాపం తెలిపారు. అలాగే ఏపీ కేబినెట్‌లో కూడా రతన్ టాటా మృతి పట్ల సంతాపం తెలియజేశారు. రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. కేవలం పారిశ్రామికవేత్తగా మాత్రమే కాకుండా ఉన్నతమైన విలువలు కలిగిన అదర్శవాది రతన్ టాటా అని తెలిపారు. రతన్ టాటా జీవితం అందరికీ ఆదర్శమన్నారు. విద్య, వైద్యం వంటి రంగాల్లో రతన్ టాటా సేవలు అద్వితీయమని కొనియాడారు. కేవలం మన దేశంలోనే కాకుండా 100కు పైగా దేశాల్లో అనేక పరిశ్రమలు స్థాపించి అనేకమందికి ఉపాధి చూపించారన్నారు. రతన్ టాటా ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను అని మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు.

**ఈ దేశం గొప్ప మానవతావాదిని కోల్పోయింది: కొండపల్లి శ్రీనివాస్...** రతన్ టాటా మృతి పట్ల రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సంతాపం వ్యక్తం చేశారు. రతన్ టాటా మరణం పారిశ్రామిక రంగానికి, ఈ దేశానికి తీరని లోటన్నారు. ఆయన గురించి తెల్సుకోవాల్సినది చాలా ఉంది. ఈ దేశం గొప్ప మానవతావాదిని కోల్పోయిందన్నారు. విలువలకు నిలువుటద్దం రతన్ టాటా అని... ఎంత ఎదిగినా ఒదిగి ఉండటం ఆయన నైజమని చెప్పుకొచ్చారు. పుట్టుకతో కోటీశ్వరుడైనా, అంతర్జాతీయ స్థాయి పారిశ్రామిక దిగ్గజంగా ఎదిగినా, సామాన్య జీవనం సాగిగించిన మహోన్నత వ్యక్తి రతన్ టాటా అని కొనియాడారు. ఆయనను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఆయన ఆత్మకి శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నాను అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

**రతన్ టాటా జీవితం యువతకు మార్గదర్శకం: బీసీ జనార్ధన్...** దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటా మరణంపై రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. రతన్ టాటా మరణం దేశానికి, పారిశ్రామిక రంగానికి తీరని లోటన్నారు. విలువలు, విశ్వసనీయత, మానవత్వం కలబోసిన మహనీయుడు రతన్ టాటా అని.. ఆదర్శప్రాయుడైన రతన్ టాటా జీవితం యువతకు మార్గదర్శకం, అనుసరణీయమన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను అని మంత్రి బీసీ జానర్ధన్ అన్నారు.

**మంత్రి సవిత దిగ్భ్రాంతి..** దిగ్గజ పారిశ్రామిక వేత్త రతన్ టాటా మృతిపై మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థకు రతన్ టాటా వెన్నుముక అని కొనియాడారు. లాభాపేక్ష లేకుండా ఎన్నో పరిశ్రమలు నెలకొల్పి ఉద్యోగ విప్లవం సృష్టించిన పారిశ్రామిక వేత్త అని, దేశం కోసం... ప్రజల కోసం... పనిచేసిన పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా అని.. సేవా కార్యక్రమాల్లోనూ రతన్ సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని, రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటని మంత్రి సవిత వ్యాఖ్యానించారు.

**దాతృత్వంలో రతన్ టాటాకు సాటిలేరెవ్వరూ: మంత్రి దుర్గేష్...** పారిశ్రామిక రంగంతో పాటు సామాజిక సేవా రంగంలో తనదైన ముద్ర వేసిన టాటా గ్రూప్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా మృతిపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ సంతాపం వ్యక్తం చేశారు. భారత పారిశ్రామిక రంగానికి దశ దిశ చూపించి నవతరం పారిశ్రామిక వేత్తలకు ఆదర్శప్రాయులైన గొప్ప వ్యక్తి రతన్ టాటా అని వెల్లడించారు. పారిశ్రామిక రంగానికి మానవత్వం జోడించి పేద ప్రజల సంక్షేమాన్ని ఆలోచించిన మానవతావాది రతన్ టాటా అని కీర్తించారు. దేశమే ముందు అనే సిద్ధాంతాన్ని ఆజన్మాంతం ఆచరించిన మహనీయులు రతన్ టాటా అని అన్నారు. దాతృత్వంలో రతన్ టాటాకు ఎవరూ సాటిరారని.. కరోనా సంక్షోభ సమయంలో ఆయన వ్యవహరించిన విధానం, అత్యవసరంగా స్పందించిన తీరు, ఖర్చు చేసిన సొమ్ము వెలకట్టలేనిదన్నారు.

రతన్ టాటా మరణం దేశానికి, పారిశ్రామిక రంగానికి తీరని లోటుగా వర్ణించారు. రతన్ టాటా పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మంత్రి కందుల దుర్గేష్ ప్రార్థించారు.

**ఏపీ ప్రజలతో మంచి అనుబంధం: పయ్యావుల...** దేశ నిర్మాణంలో కీలక భాగస్వామి రతన్ టాటాకు గౌరవ సూచకంగా ఏపీ కేబినెట్ నివాళులు అర్పించిందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఉప్పు నుంచి ఉక్కు దాకా ఆయన పరిశ్రమలు స్థాపించి లక్షలాది మందికి ఉపాధి కల్పించారన్నారు. ఏపీ ప్రజలతోనూ ఆయనకు మంచి అనుబంధం ఉందన్నారు. సామాజిక బాధ్యతగా టాటా సంస్థలు ఏపీ ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నాయన్నారు. రతన్ టాటా మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కేబినెట్‌ను వాయిదా వేశామని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు.




అమరావతి: జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మైసూరవారిపల్లికి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. రూ. 60 లక్షలు సొంత నిధులు వెచ్చించి ఆ ఊరిలో పాఠశాల కోసం ఎకరం ఆట స్థలం కొనుగోలు చేసి.. ఆ స్థలాన్ని మైసూరవారిపల్లి పంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారు. మైసూరవారిపల్లి గ్రామ సభకు వెళ్లిన సందర్భంలో అక్కడ పాఠశాలకు ఆట స్థలం లేదన్న విషయాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పవన్ కల్యాణ్‌కు వివరించారు. దసరాలోపు ఆట స్థలం ఏర్పాటు చేస్తామని నాడు ఆయన హామీ ఇచ్చారు. ఇప్పుడు పవన్ కల్యాణ్ సొంత ట్రస్ట్ నుంచి రూ. 60 లక్షలు ఖర్చు చేసి స్థలం కొనుగోలు చేసి ఇచ్చారు. ఆ స్థలం పత్రాలను ఆ గ్రామ పెద్దలకు అధికారికంగా అంద చేశారు. మైసూరవారిపల్లిలో మొదలుపెట్టిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా తీసుకువెళ్తామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆట స్థలాలు లేని పాఠశాలల గుర్తింపు ప్రక్రియ ప్రారంభించి.. ప్రతి పాఠశాలలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసే ప్రక్రియకు శ్రీకారం చుడతామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఈ కార్యక్రమం ముందుకు తీసుకువెళ్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. "బలమైన శరీరం ఉంటేనే.. బలమైన మనస్సు ఉంటుంది. బలమైన దేహదారుఢ్యం ఉంటేనే మానసికంగా మెరికల్లాంటి భావి తరాలు తయారవుతాయి. అలాంటి వారే దేశ సంపద అవుతారు. అయితే మెరికల్లాంటి భావితరాలను తయారు చేయడానికి అవసరం అయిన ఆట స్థలాలు పాఠశాలల్లో అందుబాటులో లేవు. మైసూరవారిపల్లి గ్రామ సభకు వెళ్లిన సమయంలో అక్కడ పాఠశాలకు ఆట స్థలం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు నా దృష్టికి తీసుకువచ్చారు. దసరా లోపు ఆట స్థలం ఏర్పాటు చేస్తామని మాటిచ్చాను. ఆ మాట ప్రకారం నా సొంత ట్రస్ట్ నుంచి రూ. 60 లక్షలు ఖర్చు చేసి మైసూరవారిపల్లి ప్రభుత్వ పాఠశాలకు ఆట స్థలం కొనుగోలు చేసి ఇచ్చానని" ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు.

కాగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం వచ్చాక చాలా ఏళ్లకు మళ్లీ పల్లెల్లో అభివృద్ధికాంతులు దర్శనమిస్తున్నాయి. పంచాయతీరాజ్ శాఖ మంత్రి డిప్యూటీ సీఎం పవనకళ్యాణ్ పల్లెల్లో తన మార్కుపాలన కోసం వడివడిగా అడుగులు వేస్తున్నారు. వైసీపీ హయాంలో కునారిల్లిన గ్రామ పంచాయతీలకు మళ్లీ జవసత్వాలు నింపే ప్రయత్నం చేస్తున్నారు.

కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులను అప్పట్లో జగన సర్కారు ఇతరత్రా వాటికి వాడేసింది. దీంతో పంచాయతీ ఖజానా ఖాళీ అయింది. కనీసం బ్లీచింగ్ పౌడరు చల్లేందుకు కూడా నిధులు లేని దుస్థితి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీలకు ఊపిరి పోస్తున్నారు. ఆర్థిక సంఘం నిధులు వచ్చాయి. దీంతో గ్రామ పంచాయతీలకు పూర్వవైభవం దిశగా అడుగులు పడుతున్నాయి.

## మృణాల్ ఠాకూర్ రియల్ సిస్టర్ ఎవరో తెలుసా..!

బాలీవుడ్ లో సుదీర్ఘ కాలంగా సినిమాలు చేస్తున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్ సీతారామం సినిమాతో టాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చి చాలా తక్కువ సమయంలో స్టార్ హీరోయిన్ గా పేరు దక్కించుకుంది. టాలీవుడ్ లో స్టార్ హీరోల సినిమాల్లో నటిస్తున్న ఈ అమ్మడు త్వరలో మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది. మృణాల్ ఠాకూర్ నటించిన సీతారామం, హాయ్ నాన్న సినిమాలు మంచి విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో వరుసగా ఆఫర్లు వస్తున్నాయి. టాలీవుడ్ లో ఈ అమ్మడు మోస్ట్ బిజీ హీరోయిన్ గా సినిమాలు చేస్తున్న విషయం తెల్సిందే. సోషల్ మీడియాలో రెగ్యులర్ గా తన అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. అయితే ఈసారి మాత్రం మేకప్ ఆర్టిస్టు లోచన్ ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. లోచన్ మరెవ్వరో కాదు.. మృణాల్ ఠాకూర్ సిస్టర్ అయిన లోచన్ ఠాకూర్ చాలా కాలంగా మేకప్ ఆర్టిస్టుగా ఇండస్ట్రీలో కొనసాగుతూ ఉంది. సీతారామం మొదలుకుని ఇటీవల వచ్చిన మృణాల్ సినిమా వరకు అన్నింటిలోనూ లోచన్ ఠాకూర్ మేకప్ ఆర్టిస్టుగా వ్యవహరించింది. అంతే కాకుండా హెయిర్ స్టైలిష్ చేస్తూ మృణాల్ ను మరింత అందంగా



లోచన్ చూపిస్తూ ఉంటుంది. లోచన్ ప్రస్తుతం మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా చేస్తున్న ప్రతి సినిమాకు మేకప్ ఆర్టిస్టుగా, హెయిర్ డ్రెస్సర్ గా వ్యవహరిస్తూ ఉంది. మృణాల్ ఠాకూర్ ప్రతి సినిమాలోనూ అంత అందంగా కనిపించడంలో ఆమె పాత్ర కీలకం అని దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. లోచన్ ఠాకూర్ గురించి చాలా తక్కువ మందికే తెలుసు. ఆమె బాలీవుడ్ లో వరుసగా సినిమాలకు మేకప్ ఆర్టిస్టుగా వ్యవహరిస్తోంది. ముఖ్యంగా స్టార్ హీరోయిన్స్ కి ఈమె మేకప్ ఆర్టిస్టుగా, హెయిర్ డ్రెస్సర్ గా చేస్తున్న నేపథ్యంలో అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంటుంది. తనను అందంగా చూపిస్తున్నందుకు సిస్టర్ కి కృతజ్ఞతలు అంటూ మృణాల్ ఠాకూర్ సోషల్ మీడియా ద్వారా లోచన్ ఠాకూర్ కి కృతజ్ఞతలు తెలిపింది. ప్రస్తుతం హిందీలో మూడు సినిమాలతో పాటు, తెలుగులోనూ ఒక సినిమాలో మృణాల్ ఠాకూర్ నటిస్తున్న విషయం తెల్సిందే. తమిళంలోనూ మృణాల్ ఠాకూర్ ఒక సినిమాను చేస్తుంది. ఆ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. బాలీవుడ్, టాలీవుడ్ లో వరుస సినిమాలు చేస్తున్న మృణాల్ ఠాకూర్ ముందు ముందు మరింతగా బిజీ బిజీ సినిమాలు చేసే అవకాశాలు ఉన్నాయి. సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా రెగ్యులర్ గా వార్తల్లో నిలుస్తూ ఆఫర్లు దక్కించుకుంటున్న మృణాల్ ఠాకూర్ ని లోచన్ మరింత అందంగా చూపించాలని కోరుకుందాం.

## వార్ 2 అసలు ఘట్టానికి సిద్ధమైన తారక్

'దేవర' మూవీ కమర్షియల్ సక్సెస్ దిశగా దూసుకుపోతోంది. దీంతో యంగ్ టైగర్ ఎన్టీఆర్ చాలా హ్యాపీగా ఉన్నారు. సినిమాకి మిశ్రమ స్పందనలు వచ్చిన కూడా ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. డీసెంట్ కలెక్షన్స్ తో మూవీ థియేటర్స్ లో కొనసాగుతోంది. దసరా ఫెస్టివల్ వరకు 'దేవర' మూవీ సందడి ఉంటుందని మేకర్స్ ఎక్స్ పెక్ట్ చేస్తున్నారు. ఇక లాంగ్ రన్ లో ఈ సినిమాకి 600 వరకు కలెక్షన్స్ వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉంటే 'దేవర' మూవీ టెన్షన్ తగ్గిపోవడంతో ఎన్టీఆర్ నెక్స్ట్ సినిమాల షూటింగ్ పై ఫోకస్ చేయబోతున్నాడు. మొదట హిందీ డెబ్యూ మూవీ 'వార్ 2' షూటింగ్ లో జాయిన్ కాబోతున్నారు. ఈ నెలలోనే 'వార్ 2' మూవీ కీలకమైన క్లైమాక్స్ సన్నివేశాలు షూటింగ్ ప్రారంభం కాబోతోందని తెలుస్తోంది. డైరెక్టర్ అయాన్ ముఖర్జీ దానికి సంబందించిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. యష్ రాజ్ ఫిలిమ్స్ బ్యానర్ లో స్పై థ్రిల్లర్ సిరీస్ లో భాగంగా ఈ మూవీ తెరకెక్కుతోంది. 'వార్' మూవీ సీక్వెల్ గా ఈ సినిమా కథాంశం ఉండబోతోంది. ఇక ఈ



చిత్రంలో ఎన్టీఆర్, హృతిక్ రోషన్ మధ్య అదిరిపోయే యాక్షన్ సీక్వెన్స్ ఉంటాయంట. ఎన్టీఆర్ క్యారెక్టర్ కాస్తా గ్రే షేడ్స్ లో ఉంటుందనే మాట వినిపిస్తోంది. త్వరలో ఈ మూవీ క్లైమాక్స్ సన్నివేశాలని షూట్ చేయబోతున్నారంట. ఎన్టీఆర్ తో పాటు హృతిక్ రోషన్ మీద ఈ క్లైమాక్స్ సీక్వెన్స్ ని తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. ఈ 'వార్ 2' తో ఎన్టీఆర్ కి బాలీవుడ్ లో గ్రాండ్ ఎంట్రీ లభిస్తుందని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 'ఆర్ఆర్ఆర్' సినిమాలో ఎన్టీఆర్ పెర్ఫార్మెన్స్ కి నార్త్ ఇండియన్ ఆడియన్స్ భాగా కనెక్ట్ అయ్యారు. 'దేవర' మూవీకి కూడా బాలీవుడ్ లో మంచి ఆదరణ లభిస్తోందనే మాట వినిపిస్తోంది. అయితే 'వార్ 2' తో హిందీ బెల్ట్ లో స్ట్రాంగ్ మార్కెట్ ని ఎన్టీఆర్ క్రియేట్ చేసుకోవడం గ్యారెంటీ అని అంటున్నారు. ఈ చిత్రం తర్వాత బాలీవుడ్ దర్శక, నిర్మాతలు ఎన్టీఆర్ తో స్ట్రైట్ హిందీ సినిమాలు చేయడానికి ఆసక్తి చూపించే అవకాశం ఉంది. 'వార్ 2' షూటింగ్ కంప్లీట్ అవ్వగానే, వచ్చే ఏడాది నుంచి ప్రశాంత్ నీల్ 'డ్రాగన్' పైన తారక్ ఫోకస్ చేసే అవకాశం ఉంది. అది సెట్స్ పైన ఉండగానే 'దేవర 2' కూడా స్టార్ట్ చేయొచ్చని టాక్.




## గేమ్ ఛేంజర్.. అక్కడ దేవరను బీట్ చేస్తుందా?





దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించిన ఆర్ఆర్ఆర్ మూవీతో టాలీవుడ్ స్టార్ హీరోలు జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్ ఎలాంటి క్రేజ్ సంపాదించుకున్నారో అందరికీ తెలిసిందే. పాన్ ఇండియా లెవెల్ లో గుర్తింపు దక్కించుకున్నారు. స్పెషల్ ఫ్యాన్ బేస్ క్రియేట్ చేసుకున్నారు. ఆ మూవీ తర్వాత రీసెంట్ గా తారక్.. దేవర మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన ఆ మూవీ.. బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను సాధిస్తోంది. అయితే ఆర్ఆర్ఆర్ తర్వాత చేసిన మూవీతో తారక్ హిట్ కొట్టేశారు! ఇప్పుడు రామ్ చరణ్ వంతు వచ్చింది.

ఆర్ఆర్ఆర్ విడుదల తర్వాత ఆచార్యలో గెస్ట్ రోల్ చేసిన ఆయన.. ఇప్పుడు సోలోగా గేమ్ ఛేంజర్ చిత్రంతో వస్తున్నారు. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శంకర్ తెరకెక్కిస్తున్న ఆ మూవీ షూటింగ్ ఇప్పుడు చివరి దశకు చేరుకుంది. ఓ వైపు షూటింగ్.. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. మరికొద్ది రోజుల్లో చిత్రీకరణకు గుమ్మడికాయ కొట్టనున్నారు. మేకర్స్ ఇటీవల రా మచ్చా సాంగ్ ను రిలీజ్ చేయగా.. మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు ఫ్యాన్స్ అంతా రిలీజ్ డేట్ కోసం వెయిట్ చేస్తున్నారు. అదే సమయంలో సోషల్ మీడియాలో రకరకాల చర్చలు జరుగుతున్నాయి. రాజమౌళి మిథ్ ను తారక్ బ్రేక్ చేశారని.. చరణ్ చేస్తారో లేదో చూడాలని అంటున్నారు. ఇప్పుడు గేమ్ ఛేంజర్.. బాలీవుడ్ వసూళ్లు ఎలా ఉంటాయో చూడాలని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. దేవర బీ టౌన్ వసూళ్లతో కంపేర్ చేస్తున్నారు. బాలీవుడ్ లో రూ.60 కోట్ల నెట్ కలెక్షన్స్ తో దేవర మూవీ.. థియేట్రికల్ రన్ ముగుస్తుందని అంతా అంచనా వేస్తున్నారు. ఇప్పుడు గేమ్ ఛేంజర్ అక్కడ ఎంత వసూలు చేస్తుందోనని డిస్కస్ చేసుకుంటున్నారు. రూ.60 కోట్లను రాబడుతుందా.. లేక దాన్ని బీట్ చేస్తుందోనని మాట్లాడుకుంటున్నారు.

ప్రస్తుతం నెటిజన్ల చర్చ బట్టి.. గేమ్ ఛేంజర్ బాలీవుడ్ టార్గెట్ రూ.60 కోట్లు అన్నమాట! ఇక సినిమా విషయానికొస్తే.. చరణ్ సరసన బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ, తెలుగు అమ్మాయి అంజలి హీరోయిన్లుగా నటిస్తున్నారు. కోలీవుడ్ నటుడు ఎస్ జే సూర్య విలన్ గా కనిపించనున్నారు. శ్రీకాంత్, సునీల్, సముద్రఖని, నవీన్ చంద్ర కీలక పాత్రలు పోషిస్తున్నారు. పొలిటికల్, యాక్షన్ నేపథ్యంలో సాగే పవర్‌ఫుల్ స్టోరీతో రూపొందుతున్న గేమ్ ఛేంజర్ మూవీ.. మరి బాలీవుడ్ లో ఎంతటి వసూళ్లు సాధిస్తుందో వేచి చూడాలి.

## తంగలాన్ ఓటీటీ సమస్య.. ఎందుకు ఈ ఆలస్యం?




చియాన్ విక్రమ్ హీరోగా పా రంజిత్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం "తంగలాన్". ఈ సినిమా థియేటర్లలో గ్రాండ్ గా విడుదలై విమర్శకుల నుంచి మంచి స్పందనను పొందింది, అయితే కమర్షియల్ గా ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది. తెలుగు మార్కెట్ లో మొదటి వారం డీసెంట్ వసూళ్లు రాబట్టడం కొంత ఊరటనిచ్చినా, తమిళనాడులో మాత్రం ఈ సినిమా యావరేజ్ వద్దే ఆగిపోయింది. హిందీ మార్కెట్ లో అయితే ఈ సినిమాని డిజాస్టర్ గా పరిగణిస్తున్నారు. కర్ణాటక, కేరళ వంటి ప్రాంతాల్లో కూడా పెద్దగా స్పందన రాలేదు. తంగలాన్ వంటి పీరియాడిక్ విలేజ్ డ్రామాలు కేవలం థియేటర్లలో మాత్రమే కాకుండా, ఓటీటీ ప్లాట్‌ఫార్మ్‌లలో కూడా మంచి స్పందన రాబట్టే అవకాశం ఉంటుంది. డిజిటల్ స్ట్రీమింగ్ కోసం సినీ ప్రేక్షకులు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నారు. అయితే, సినిమా డిజిటల్ రిలీజ్ కు సంబంధించి కొన్ని సమస్యలు ఎదురయ్యాయి. ఇంతకీ ఈ చిత్రం ఎప్పుడో ఓటీటీలోకి రావాల్సి ఉండగా, ఇంకా ఆలస్యం ఎందుకు జరుగుతోంది అనే విషయంలో రకరకాల రూమర్స్ వస్తున్నాయి. ఇక అసలు వివరాల్లోకి వెళ్తే, తంగలాన్ మూవీ ఓటీటీ హక్కులను ఒక ప్రముఖ డిజిటల్ స్ట్రీమింగ్ సంస్థ ముందుగానే కొనుగోలు చేసినట్లు ప్రచారం జరిగింది. ఇంతలోనే, ఈ చిత్రం డిజిటల్ స్ట్రీమింగ్ అక్టోబర్ 20న విడుదల అవుతుందని కూడా ప్రకటించారు. కానీ అనూహ్యంగా ఆ తేదీ దగ్గరపడుతున్నా కూడా స్ట్రీమింగ్ ప్రారంభం కాకపోవడం సర్వత్రా ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇప్పుడు అందుకు గల కారణం డీల్ లో ఏర్పడిన వివాదం అని చెన్నై వర్గాల సమాచారం. ఓటీటీ సంస్థ ఒక ధరకు హక్కులను అంగీకరించినా, సినిమా విడుదల తర్వాత ఆ సంస్థ నిర్ణయాన్ని మార్చుకున్నట్లు తెలుస్తోంది. సినిమా పెద్దగా ఆడకపోవడంతో, పబ్లిక్ టాక్, రివ్యూలు నెగటివ్ గా ఉండడం వలన, ఒప్పందంలో ఉన్న ఒక క్లాజ్ ప్రకారం ఆ సంస్థ ఇప్పుడు ముందుగా అంగీకరించిన మొత్తాన్ని తగ్గించాలని కోరుతోంది. ఈ వ్యవహారం కారణంగా, తంగలాన్ స్ట్రీమింగ్ ఆలస్యం అవుతుందని తెలుస్తోంది. ఓటీటీ సంస్థ ఇప్పటికీ తగిన రేటును సవరించాలని ఇస్తోన్న ప్రెజర్ వల్ల, సినిమా డిజిటల్ రిలీజ్ పూర్తిగా తాత్కాలికంగా వాయిదా పడింది. ఒకవేళ మొదట ఒప్పందం కుదిరిన సంస్థ వెనక్కు తగ్గితే, వేరే ఓటీటీ ప్లాట్‌ఫార్మ్ తో సినిమా స్ట్రీమింగ్ కోసం తంగలాన్ నిర్మాతలు చర్చలు జరుపుతున్నట్లు కూడా సమాచారం. ఈ పరిస్థితి స్టార్ హీరో విక్రమ్ లాంటి నటుడితో, భారీ బడ్జెట్ తో నిర్మించిన పాన్ ఇండియా చిత్రానికి అసలు అవసరమా? అని ఇండస్ట్రీ వర్గాలు చర్చిస్తున్నాయి. మొదటినుంచి సినిమాపై భారీ అంచనాలు ఉన్నప్పటికీ, విడుదల తరువాత సినిమాకు అంత ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడంతోనే ఈ విధమైన సమస్యలు వస్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## కార్ లోనే కాస్ట్యూమ్స్ ఛేంజ్.. హీరోయిన్ డెడికేషన్ అంటే ఇదే..!

ఒక సినిమా కోసం తెర వెనక ఎంతమంది కష్టపడతారో తెర మీద కనిపించే వారు కూడా అదే రేంజ్ లో కష్టపడుతుంటారు. ముఖ్యంగా హీరో హీరోయిన్స్ మీద ఈ బాధ్యత ఎక్కువ ఉంటుంది. స్క్రీన్ మీద అందంగా కనిపించే హీరోయిన్ వెనక కనపడని కష్టం ఉంటుంది. అది ఎవరో చెబితేనో తెలుస్తుంది. బాలీవుడ్ భామ విద్యా బాలన్ ఒక సినిమా కోసం పడిన కష్టాన్ని కాస్టింగ్ డైరెక్టర్ ముఖేష్ ఛాబ్రా చెప్పి ఆడియన్స్ ను సర్ ప్రైజ్ చేశారు. ఇండియన్ సిల్వర్ స్క్రీన్ మీద అద్భుతమైన పాత్రలతో మెప్పిస్తూ వస్తున్న నటీమణి విద్యా బాలన్. 2005 లో పరినీతతో మొదలైన ఆమె కెరీర్ లో ఎన్నో సూపర్ హిట్ సినిమాలు చేసింది. అంతేకాదు ఛాలెంజింగ్ రోల్స్ అన్నిటిలో కూడా మెప్పించింది. విద్యా బాలన్ అనగానే గుర్తొచ్చేలా కొన్నిల్ సినిమాలు చేసింది. అందులో డర్టీ పిక్చర్, కహాని, భూల్ భూలియా



సినిమాలు ఉన్నాయి. ఐతే కహాని సినిమా కోసం ఆమె పడిన కష్టాన్ని చూపించిన డెడికేషన్ ను రీసెంట్ గా ఒక ఇంటర్వ్యూలో వెల్లడించారు కాస్టింగ్ ఐరెక్టర్ ముఖేష్ ఛాబ్రా. కహాని షూటింగ్ టైట్ బడ్జెట్ వల్ల వానిటీ వ్యాన్ అదే కార్ వ్యాన్ ని ఏర్పాటు చేయలేకపోయారట. ఐతే ఒక సీన్ లో విద్యా బాలన్ కాస్ట్యూమ్స్ ఛేంజ్ చేయాల్సిన అవసరం రాగా అక్కడ పక్కనే ఉన్న కార్ లో కాస్ట్యూమ్స్ మార్చుకున్నదని చెప్పుకొచ్చారు. రోడ్డు పక్కనే ఇన్నోవా కార్ కు బ్లాక్ క్లాత్ కట్టి ఆమెను అందులోనే కాస్ట్యూమ్స్ మార్చుకోమని అన్నారు.

విద్యా బాలన్ కూడా ఎలాంటి ఇబ్బంది ఫీల్ అవ్వకుండా కాస్ట్యూమ్స్ మార్చుకుని వచ్చేసింది. సినిమా పట్ల ఆమెకు ఉన్న అంకిత భావానికి హ్యాట్సాఫ్ అనేశారు. విద్యా బాలన్ ని అభినానించే వారు ఈ విషయం తెలిసి ఆమెను మరింత ఎక్కువగా ఇష్టపడతారు. కహాని సినిమా కోసం విద్యా బాలన్ అంత కష్టపడ్డారు కాబట్టే సినిమా సూపర్ హిట్ గా నిలిచింది. ఈమధ్య కాస్త జోరు తగ్గించిన విద్యా బాలన్ ఎలాంటి పాత్ర వచ్చినా ఇప్పటికీ చేసేందుకు రెడీ అని అంటుంది. ప్రస్తుతం హిందీలో అమ్మడు రెండు ప్రాజెక్టుల్లో నటిస్తుంది.

## బాలీవుడ్‌లో సమంత ఇన్‌సైడరా? ఔట్ సైడరా?

అనన్య పాండే %జు=ా% ఇటీవల నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైంది. సమంతా తన సోషల్ మీడియాలో అనన్య నటనపై ప్రశంసలు కురిపించింది. ఇది అనన్య, సమంతల అభిమానుల దృష్టిని ఆకర్షించింది. సమంత నిరంతరం హిందీ మీడియా వార్తల్లో నిలవడం కోసమే ఆమె ఇలా చేస్తోందని కొందరు అభిప్రాయపడ్డారు. అంతంత మాత్రం నటన, గ్లామర్ డాళ్ అప్పియరెన్స్ తో కనిపించే అనన్యను సమంత అంత ఇదిగా పొగిడేయడం వెనక ఏదైనా లాజిక్ ఉందా? అంటూ ఇప్పుడు రంధ్రాన్వేషణ జరుగుతోంది. దీనిని ఒక్కొక్కరూ ఒక్కోలా విశ్లేషిస్తున్నారు. అనన్య పాండే బాలీవుడ్ ఇన్ సైడర్. ఒక పాపులర్ నటుడి(చంకీ పాండే)కి నటవారసురాలు. అనన్యను పొగిడేయడం అంటే, అనన్య స్నేహితురాళ్లు అయిన సారా అలీఖాన్, సుహానా ఖాన్, జాన్వీ కపూర్, ఖుషీ కపూర్ లాంటి నటవారసురాళ్లందరికీ బాసట పలికినట్టే. అలాగే షారూఖ్, చంకీపాండే, బోనీకపూర్, కరణ్ జోహార్ వంటి ప్రముఖుల దృష్టిలో తమ వ్యక్తి (ఇన్ సైడర్) అని కళ్లలో పడటం సులువు. సమంత ఒకే దెబ్బకు పది పిట్టలు అన్న చందంగా వారందరికీ కనెక్టయిపోతోంది.



చివరికి ఇది సమంత బాలీవుడ్ కెరీర్ కి సహకరిస్తుందనేది వ్యూహం. అలాగే బాలీవుడ్ లో నవతరం దూకుడు చాలా స్పష్టంగా కనిపిస్తోంది. వీరందరి నుంచి తనకు పోటీ అన్నది లేకుండా ఎలా వ్యూహం రచించాలో కూడా సమంతకు ఒక ఐడియా ఉందని కూడా ఊహిస్తున్నారు. ఫ్యామిలీమ్యాన్ 2 లో రాజీ పాత్ర, సిటాడెల్ హనీబన్నీలో సూపర్ గాళ్ పాత్రతో సమంత ప్రతిభపై అంచనా పెద్ద స్థాయిలో ఉంది. అందుకే ఇప్పుడు ఆచితూచి అడుగులేస్తోంది సమంత. అలాగే ఇన్ సైడర్స్ , ఔట్ సైడర్స్ టాపిక్ తో ఔట్ సైడర్స్ తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రతిభ ఉండి కూడా ఇన్ సైడ్ సరైన సత్సంబంధాలు లేకపోతే ఇబ్బందే. ఇవన్నీ ఆలోచించి సామ్ తెలివిగా తన స్నేహాలను కొనసాగిస్తోందని విశ్లేషిస్తున్నారు. మరీ ఇంతగా ఆలోచించాల్సిన అవసరం లేకపోతే .. సామ్ యాధృచ్ఛికంగానే అనన్య పాండే వెబ్ షో చూశాక తనకు బాగా నచ్చేయడం వల్ల అలా స్పందించి ఉంటుందని కొద్దిమంది విశ్లేషిస్తున్నారు. మరికొందరు అనన్య పాండే ఏ లిస్టర్స్ లో ఉంది గనుక తాను కూడా అలాంటి వారితోనే స్నేహం చేయాలనుకుంటోందని విశ్లేషిస్తున్నారు. ఔట్ సైడర్స్ కి సానుకూలంగా ఉండటం వల్ల కూడా బాలీవుడ్ లో ఒదిగేదేమీ ఉండదు. అందుకే సమంత ఇలా చేస్తోందని అందరూ ఊహిస్తున్నారు.



# కొండా సురేఖపై కేటీఆర్ పరువు నష్టం దావా

హైదరాబాద్: మంత్రి కొండా సురేఖపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పరువు నష్టం దావా వేశారు. నాంపల్లి ప్రత్యేక కోర్టులో ఆయన తరఫు న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు దీనికి సంబంధించిన పిటిషన్ దాఖలు చేశారు. భారాస నేతలు బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, తుల ఉమ, దాసోజు శ్రవణ్‌ను సాక్షులుగా పేర్కొన్నారు. ఇటీవల కొండా సురేఖ మీడియాతో మాట్లాడుతూ సినీరంగంలోని పలువురిని ప్రస్తావిస్తూ కేటీఆర్‌పై ఆరోపణలు చేశారు. కొండా సురేఖపై ఇప్పటికే ప్రముఖ సినీనటుడు నాగార్జున క్రిమినల్ పరువు నష్టం దావా వేసిన సంగతి తెలిసిందే. ఆమె తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార వ్యాఖ్యలు చేశారని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు.

## నాగచైతన్య-సమంత విడాకులపై మంత్రి వ్యాఖ్యలు.. కొండా సురేఖకు కోర్టు నోటీసులు



హైదరాబాద్: తన కుటుంబంతో పాటు, కుమారుడు నాగచైతన్య-సమంత విడాకుల వ్యవహారంపై మంత్రి కొండా సురేఖ అనుచిత వ్యాఖ్యలు చేశారని సినీ నటుడు నాగార్జున నాంపల్లి కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టిన న్యాయస్థానం మంత్రి కొండా సురేఖకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈనెల 23కు వాయిదా వేసింది. రాజకీయ విమర్శల్లో భాగంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ నాగార్జున, నాగచైతన్య, సమంతల పేర్లను ప్రస్తావించారు. ఈ వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర దుమారం రేపింది. ఈ క్రమంలో నాగార్జున మంత్రిపై నాంపల్లి కోర్టులో క్రిమినల్ పరువునష్టం దావా వేశారు. ఆమె తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార వ్యాఖ్యలు చేశారని, ఆమెపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు.



# దసరాకు ఈ ప్రతిజ్ఞ చేద్దాం

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మంత్రి పొన్నం ప్రభాకర్ బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఆయన వీడియో సందేశం విడుదల చేశారు. ఇందులో వాహనదారులకు పలు సూచనలు చేశారు. సగటున దేశవ్యాప్తంగా సంవత్సరానికి లక్షా 60 వేల మంది రోడ్డు ప్రమాదంలో చనిపోతున్నారని చెప్పారు. తెలంగాణలో సగటున రోజుకు 20 మంది రోడ్డు ప్రమాదంలో మరణిస్తున్నారని తెలిపారు. "దసరా చెడుపై మంచి విజయం సాధించిన దానికి గుర్తు. కుటుంబ సభ్యులందరం కలిసి ఈ పండగకు ఆయుధపూజ చేసే సమయంలో ఒక ప్రతిజ్ఞ చేద్దాం.

ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం, హెల్మెట్, సీటు బెల్టు పెట్టుకుందామని ప్రమాణం చేద్దాం. మద్యం తాగి వాహనం నడపరాదు.. ఇది ప్రమాదానికి సూచిక" అని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# బతుకు నిచ్చే పండగ బతుకమ్మ పండుగ



హైదరాబాద్, అక్టోబర్ 10: తెలంగాణ ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు మంత్రి సీతక్క. బతుకమ్మ స్ఫూర్తితో ప్రకృతిని, చెరువులను కాపాడుకుందామని ఈ సందర్భంగా మంత్రి పిలుపునిచ్చారు. చెరువులకు బతుకమ్మకు అవినాభావ సంబంధం ఉందని.. చెరువులు నిండితేనే మన పంటలు పండుతాయన్నారు. పంటలు పండుతేనే మనం పండుగ చేసుకోగలుగుతామన్నారు. అందుకే అందరమూ చెరువులను కాపాడుకుందామని చెప్పుకొచ్చారు. బతుకు నిచ్చే పండగ బతుకమ్మ పండుగ అని పేర్కొన్నారు. వర్షాకాలం ముగుస్తున్న సమయంలో బతుకమ్మ పండుగను జరుపుకుంటామని తెలిపారు. చెరువులకు పూజలు చేసే పండుగ బతుకమ్మ అని అన్నారు. చప్పట్లతో ఆడుతూ గొంతెత్తి పాడటం వల్ల ఆనందం, ఆరోగ్యం కలుగుతాయన్నారు. ఆరోగ్యాన్ని ఆనందాన్ని ఇచ్చి పండుగ బతుకమ్మను ఘనంగా నిర్వహించుకుందామన్నారు. పూలను పూజిస్తూ, చెరువులను ఆరాధిస్తూ బతుకమ్మ పండుగ జరుపుకుంటున్న ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు అని మంత్రి సీతక్క వెల్లడించారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక మన బతుకమ్మ పండుగని కేటీఆర్ అన్నారు. పూలను, ప్రకృతిని దేవుళ్లుగా కొలుస్తూ ఆడ బిడ్డలు ఆనందంగా జరుపుకునే అద్భుమైన పండుగన్నారు. దేశంలోనే ఎక్కడ లేని అరుదైన, అందమైన సంస్కృతి వారసత్వం మన బతుకమ్మ పండగ అని గుర్తుచేసుకున్నారు. చిన్న పెద్ద అని తేడా లేకుండా ఆడ బిడ్డలంతా ఎంతో సంతోషంగా ఈ ఘనమైన పండుగను జరుపుకుంటారన్నారు. ఆడబిడ్డల జీవితాల్లో బతుకమ్మ తల్లి మరిన్ని సంతోషాలు, వెలుగు నింపాలని కోరుకుంటున్నాని తెలుపుతూ ఆడబిడ్డలందరికీ కేటీఆర్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు తెలంగాణ వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలు జరుపుకోనున్నారు. ఈరోజుతో బతుకమ్మ సంబురాలు ముగియనున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ వేడుకల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇటు ట్యాంక్ బండ్ వద్ద కూడా బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితరులు హాజరుకానున్నారు. బతుకమ్మ సంబరాల నేపథ్యంలో ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

# 20న కేబీఆర్ పార్కులో ప్రజా సంబురాలు

హైదరాబాద్ సిటీ: ప్రజా పాలనలో భాగంగా మన సంస్కృతి, వారసత్వ సంపద తెలిసేలా ఈనెల 20న కేబీఆర్ పార్కులో ప్రజా సంబురాలను నిర్వహిస్తున్నామని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. ఖైరతాబాద్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో బుధవారం ప్రజా సంబురాల నిర్వహణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేచర్, కల్చర్, ఆర్ట్, క్రాఫ్ట్, అడ్వెంచర్ తదితర కాంపిటీషన్స్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. కేబీఆర్ పార్కుకు 9 గేట్లు ఉన్నాయని, ఒక్కో గేటు వద్ద ఒక్కో యాక్టివిటీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ముమ్ముందు ప్రజల సందడి ఉన్నచోట ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, పంకజ, వేణుగోపాల్ రెడ్డి, చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ సునంద, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి పాల్గొన్నారు.

## కేసీఆర్‌ను విమర్శించడమే మీ విధానమా..? రేవంత్ రెడ్డిని సూటిగా ప్రశ్నించిన ఎమ్మెల్యే సబిత

హైదరాబాద్ : ఎక్కడ పడితే అక్కడ.. విద్యార్థులు, టీచర్ల ముందు కేసీఆర్‌ను విమర్శించడమే మీ విధానమా..? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా రెడ్డి సూటిగా ప్రశ్నించారు. గడిచిన పది నెలలలో కేసీఆర్ పేరు ఎత్తకుండా ఒక్క సభలో అయినా మాట్లాడారా..? అని అడిగారు. నిన్న డీఎస్సీ నియామక పత్రాల అందజేత సందర్భంగా కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి విమర్శించిన తీరుపై సబితా ఇంద్రారెడ్డి ఎక్స్ వేదికగా స్పందించారు. రేవంత్ రెడ్డి మాట్లాడేటప్పుడు అది ప్రభుత్వ కార్యక్రమా లేక పార్టీ కార్యక్రమా మర్చిపోతున్నారు. మీరు ఇచ్చాం అని చెప్తున్న టీచర్ పోస్టులు కేసీఆర్ మంజూరు చేసినవి కావా..? ఉన్నత విద్యాశాఖలో 3202 పోస్టులు, యూనివర్సిటీలలో 1081 పోస్టులు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసినవి కావా..? అని సబితా ఇంద్రారెడ్డి నిలదీశారు. ఇంటర్, టెక్నికల్, కాలేజియేట్ ఎడ్యుకేషన్ సంబంధించి 3896 కాంట్రాక్టు ఉద్యోగులను కేసీఆర్ రెగ్యులర్ చేశారు అని చెప్తే బాగుండేది. ఎన్నికల ముందు మీరు చెప్పిన 25,000 టీచర్ పోస్టులు ఎందుకు ఇవ్వలేదు అని ఆ గురువుల ముందు చెప్తే బాగుండేది. ఎన్నికలప్పుడు 6000 పాఠశాలలు మూతపడ్డాయి అని అబద్ధం చెప్పిన మీరు, ఆ పాఠశాలల లిస్ట్ విడుదల చేస్తే బాగుండేది. మన ఊరు మన బడి కార్యక్రమం ఎందుకు ఆపేశారో చెప్తే బాగుండేది. 6 లక్షల మంది పేద విద్యార్థులు చదువుతున్న కేసీఆర్ ప్రవేశ పెట్టిన గురుకులాలను ఈ ప్రభుత్వం నిర్వీర్యం చేద్దాం అనుకుంటున్నది అని చెప్తే బాగుండేది. ప్రభుత్వ పాఠశాలలో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ ఎందుకు ఆపేశారో చెప్తే బాగుండేది. ఎన్నికల సమయంలో చెప్పినట్టు ప్రతి విద్యార్థికి 5 లక్షల విద్య భరోసా కార్డు ఎప్పుడు ఇస్తారో చెప్తే బాగుండేది. 19 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్న మీరు మిగితా పాఠశాలలను గాలికి వదిలేశాము అని చెప్తే బాగుండేది అని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ధ్వజమెత్తారు.



# చిత్తు చిత్తుల బొమ్మ.. అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు

హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. గురువారం చివరి రోజైన సద్దుల బతుకమ్మ కావడంతో తెలంగాణ గల్లీగల్లీ నుంచి హైదరాబాద్ బస్తీల వరకు వేడుకలు ఆకాశాన్నంటాయి. ఇటు ట్యాంక్‌బండ్ పరిసరాల్లో మంత్రి సీతక్క సహ పలువురు మహిళ నేతలు, మహిళలు, యువతులు పెద్ద ఎత్తున తరలివచ్చి బతుకమ్మ సంబరాల్లో పాల్గొనగా.. మరోపక్క ఊరువాడా పూలవనంలా మారిపోయింది.

మహిళలు, యువతులు, చిన్నారుల ఆటపాటలతో రాష్ట్ర వ్యాప్తంగా సందడి వాతావరణం నెలకొంది. అక్టోబర్ 2న ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఉత్సవాలు సద్దుల బతుకమ్మతో ముగుస్తున్నాయి. రాష్ట్ర ఆవిర్భావం నుంచే బతుకమ్మ సంబురాలను ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోంది. దీంతోపాటు బతుకమ్మను రాష్ట్ర పండుగగా గుర్తించి గౌరవించింది. బతుకమ్మల నిమజ్జనానికి ఊళ్లలో ఉండే చెరువులతో పాటు హైదరాబాద్ వాసులు తమ సమీప నీటి వనరులను ఉపయోగించుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు రాజ్‌భవన్‌లో జరిగిన బతుకమ్మ వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సతీమణి సుధాదేవ్ పాల్గొన్నారు.

గవర్నర్‌గా నియమితులైన తర్వాత తొలిసారి సంబురాలు జరుపుకుంటుండడంతో పూల పండుగ విశిష్టతను అధికారులు గవర్నర్ దంపతులకు అధికారులు వివరించారు.



# మంచి స్నేహితుడిని కోల్పోయా

దిగ్గజ పారిశ్రామిక వేత్త, టాటా గ్రూప్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా (86) మృతి చెందిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ రతన్ టాటాకు సంతాపం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా తాను ఒక మంచి స్నేహితుడిని కోల్పోయానంటూ అంబానీ పోస్ట్ పెట్టారు. "నేనొక మంచి స్నేహితుడిని కోల్పోయాను. రతన్ టాటా మరణించడం కేవలం టాటా గ్రూపుకే కాదు.. ప్రతీ భారతీయుడికి తీరని లోటు. రతన్ టాటా మరణం నాలో ఎనలేని దుఃఖాన్ని నింపింది. ఆయన్ను కలిసిన అన్ని సందర్భాలు నాలో స్ఫూర్తిదాయకమైన శక్తినిచ్చాయి. టాటాలోని గొప్పతనం, మూర్తీభవించిన మానవతా విలువలు ఆయనపై గౌరవాన్ని మరింత పెంచాయి. దూరదృష్టి గల పారిశ్రామికవేత్త, పరోపకారి. ప్రపంచంలోని అత్యుత్తమమైన వాటిని భారత్‌కు తీసుకువచ్చారు. 1991లో ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి టాటా గ్రూపును 70 రెట్లు అంతర్జాతీయ సంస్థగా మార్చారు. రిలయెన్స్, నీతా అంబానీ, అంబానీ కుటుంబసభ్యుల తరఫున.. టాటా కుటుంబసభ్యులకు, గ్రూప్ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. రతన్ ఎప్పుడూ నా హృదయంలోనే ఉంటారు"- ముకేశ్ అంబానీ

# ఎక్కడా లేని అరుదైన వారసత్వం మన బతుకమ్మ



హైదరాబాద్ : తెలంగాణలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఎనిమిది రోజుల పాటు ఒక్కో పేరుతో బతుకమ్మను పేర్చి ఆడిపాడిన ఆడపడుచులు ఈరోజు సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొననున్నారు. ఈరోజుతో తెలంగాణలో బతుకమ్మ సంబరాలు ముగియనున్నాయి. సద్దుల బతుకమ్మ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు తెలియజేశారు. తొలిరోజు ఎంగిపూల బతుకమ్మను పురస్కరించుకుని తెలంగాణ ఆడపడుచులకు శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్.. చివరి రోజు సద్దుల బతుకమ్మ సందర్భంగా ఎక్స్ వేదికగా విషెష్ తెలిపారు.

**కేటీఆర్ పోస్ట్...** తెలంగాణ సంస్కృతికి ప్రతీక మన బతుకమ్మ పండుగని కేటీఆర్ అన్నారు. పూలను, ప్రకృతిని దేవుళ్లుగా కొలుస్తూ ఆడ బిడ్డలు ఆనందంగా జరుపుకునే అద్భుమైన పండుగన్నారు. దేశంలోనే ఎక్కడ లేని అరుదైన, అందమైన సంస్కృతి వారసత్వం మన బతుకమ్మ పండగ అని గుర్తుచేసుకున్నారు. చిన్న పెద్ద అని తేడా లేకుండా ఆడ బిడ్డలంతా ఎంతో సంతోషంగా ఈ ఘనమైన పండుగను జరుపుకుంటారన్నారు. ఆడబిడ్డల జీవితాల్లో బతుకమ్మ తల్లి మరిన్ని సంతోషాలు, వెలుగు నింపాలని కోరుకుంటున్నాని తెలుపుతూ ఆడబిడ్డలందరికీ కేటీఆర్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

## రిజర్వేషన్ల వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టండి: మందకృష్ణ



హైదరాబాద్: మాదిగలను నమ్మించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్ని ప్రకటనలు చేసినా, నమ్మే పరిస్థితి లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల అమలు చేయకుండానే 11వేలకు పైగా ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశారని విమర్శించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్లకూ వర్గీకరణ వర్తింపజేస్తామని చెప్పి, అమలు చేయకుండానే టీచర్ పోస్టులు భర్తీ చేశారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి శాసనసభలో చెప్పిన మాటలకే విలువలేదని విమర్శించారు. శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తామంటే అనుమతి ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వమే కాదు.. రేవంత్ ప్రభుత్వం కూడా నిర్బంధాలతోనే నడుస్తోందని ఆరోపించారు.

గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలకు వర్గీకరణ వర్తింపజేయాలని.. లేదంటే వర్గీకరణ తర్వాతే గ్రూప్-1 పరీక్ష నిర్వహించాలని, గ్రూప్-3 పరీక్షలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్-4 ఫలితాలు ఇప్పటికే 16 నెలలు ఆగాయని, వర్గీకరణ జరిగే వరకు మరో 2 నెలలు వాయిదా వేయాలని కోరారు. ఈ నెల 16న వరంగల్‌లో భారీ సమావేశం నిర్వహిస్తామన్న ఆయన.. ఆ సమావేశంలో అన్ని కమిటీల సభ్యులు పాల్గొంటారని అన్నారు. ఇప్పటివరకు ఆవేదనతోనే నిరసన చేశామని.. ఇకపై తమ ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.

## నేను పదవుల కోసం ఏనాడూ పాకులాడలేదు.. రేవంత్‌కు వినోద్ కుమార్ చురకలు

హైదరాబాద్ : నేను పదవుల కోసం ఏనాడూ పాకులాడలేదు.. నా చరిత్ర అందరికీ తెలుసు అని బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంపై తుపాకీ పెట్టిన రేవంత్ రెడ్డా నా గురించి మాట్లాడేది అని వినోద్ కుమార్ చురకలంటించారు. తెలంగాణ భవన్‌లో వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడారు. నాకు ఓడిపోతే కేసీఆర్ ఉద్యోగం ఇచ్చారని రేవంత్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ఆరంభం నుంచి నేను ఉన్నాను. నేను తెలంగాణ కోసం ఎంపీగా రాజీనామా చేసి గెలిచాను. ఢిల్లీలో తెలంగాణ కోసం 32 పార్టీలను ఒప్పించేందుకు కేసీఆర్‌తో కలిసి ప్రయత్నించాను. ప్లానింగ్ బోర్డు ఛైర్మన్‌గా నా భాధ్యతను తెలంగాణ అభివృద్ధి కోసం నిర్వర్తించాను.

నా గురించి సీఎం హేళనగా మాట్లాడారు కనుకే స్పందిస్తున్నానని వినోద్ కుమార్ తెలిపారు. కేసీఆర్ ఉద్యోగాలు ఇచ్చినా మేము ప్రచారం చేసుకోలేదు. మేము ఉద్యోగాలు ఇస్తే నియామక పత్రాలు పోస్టులో వెళ్ళేవి. ఇపుడు ఎల్బీ స్టేడియంలో ఇస్తున్నారు. మేమిచ్చిన నోటిఫికేషన్లకు ఉద్యోగాలు ఇచ్చి ప్రచారం చేసుకుంటున్నారు. 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చాక ప్రచారం చేసుకోండి. కేసీఆర్ వల్లే తెలంగాణ వచ్చిందన్న రేవంత్ ఇపుడు కొరివి దయ్యం అంటున్నారు. రేవంత్ రెడ్డికి ఎన్ని నాలుకలు ఉన్నాయి..? రేవంత్ ప్రభుత్వం వచ్చాక ఇచ్చిన నోటిఫికేషన్లు లేనే లేవు అని వినోద్ కుమార్ స్పష్టం చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com